www.prajanaava.in
Telugu Daily
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 18 | బుధవారం | 19 ఆగస్టు, 2026




# భూ పంపిణీతోనే సామాజిక న్యాయం

**'భూలక్ష్మి' పథకంతో ప్రతి కుటుంబానికి ఎకరం భూమి**

- అధికారంలోకి రాగానే అమలు చేస్తాం
- సామాజిక న్యాయం అంటున్న సీఎం.. చేసేది మాత్రం అటవిక న్యాయం
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం సాధించాలంటే మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ఎకరం భూమి అందించేలా 'భూలక్ష్మి' పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం నినాదంగా కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని కవిత చెప్పారు. ఈ నెల 6న నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పు మొదలైందని, ఇంతకాలం సామాజిక న్యాయం గురించి మాట్లాడని ముఖ్యమంత్రి ఇప్పుడు అదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారని అన్నారు. పేదలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ఆదివాసీలకు భూమి అంటే భావోద్వేగంతో ముడిపడిన అంశమని కవిత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో సుమారు 60 లక్షల ఎకరాల భూమి ఉందని, నిజాం ఇచ్చిన భూములు, భూదాన్ భూములు కూడా ఉన్నాయని చెప్పారు. భూదాన్ భూముల్లో లక్ష ఎకరాల వరకు లెక్కల్లో లేకుండా పోయాయని ఆరోపించారు. భూమి పంపిణీపై అధ్యయనం చేసిన తర్వాతే 'భూలక్ష్మి' పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామని స్పష్టం చేశారు.

**పేదల భూములను లాక్కుంటే ఊరుకోం**

ముఖ్యమంత్రి కుటుంబం భూ దోపిడీకి పాల్పడుతోందని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలకు భూములు పంచాల్సిన ప్రభుత్వం పరిశ్రమల పేరుతో వారి భూములను లాక్కుంటోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల నుంచి 30వేల ఎకరాలు తీసుకున్నారని ఆరోపించారు. పేదల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ధరణి, భూ భారతి చట్టాలను భూ దోపిడీకి అనుకూలంగా ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని తరువాయి 2లో..

# 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి!

**నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేట్ భూములకు విముక్తి**

- వేగవంతంగా సమస్యల పరిష్కారం
- 15రోజుల పాటు ప్రత్యేక కమిటీ పర్యవేక్షణ
- చట్టబద్ధమైన పేదల భూమిలో ఒక్క అంగుళం కూడా తీసుకోం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**ప్రజానావ, హైదరాబాద్:** 22ఏ నిషేధిత భూముల జాబితాలో పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత 24 గంటల్లోనే మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో నాలుగు.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. నిజమైన ప్రైవేట్ ఆస్తుల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాటికి పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితాలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే ప్రక్రియను వేగవంతం చేశామని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ తరువాయి 2లో..

## 22ఏ భూములపై బీఆర్ఎస్ జనతా గ్యారేజ్



- నిషేధిత జాబితా నుంచి భూములు తొలగించే వరకు ప్రజలకు అండగా ఉంటాం
- ప్రభుత్వ తప్పులకు ప్రజలను ఎందుకు శిక్షి స్తారు?
- పొంగులేటి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2



# పాపన్న పోరాటం అద్భుతం

**ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడు**

- అమరవీరుల స్థూపంతో సమానంగా పాపన్న విగ్రహానికీ ప్రాధాన్యం
- 117 సీట్లతో 2029లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడు పాపన్న అని పేర్కొన్నారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉందో పాపన్న విగ్రహానికీ అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. మంగళవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో తెలంగాణ వెనుకబడిందని, పాపన్న వంటి మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఫ్యామిలీ జస్టిస్.. సోషల్ జస్టిస్**

గత పాలనపై రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. 'బీఆర్ఎస్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. కాంగ్రెస్‌ది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. గత పాలకులు కుటుంబ సభ్యులకు పదవులు, ఫామ్‌హౌస్‌లు ఇచ్చారని విమర్శిస్తూ.. తమ ప్రభుత్వం ఉద్యమకారులు, పేదలు, బీసీలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం అన్నారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి భారంగా మారిందని, వడ్డీలు చెల్లించిన తర్వాత మిగిలే నిధులతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తరువాయి 2లో..




## క్లీన్ ఎనర్జీకి తెలంగాణ హబ్!

- పెట్టుబడిదారులకు రాష్ట్రం స్వర్గధామం
- 2030 నాటికి 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ సామర్థ్యం
- గ్రీన్ హైడ్రోజన్, విద్యుత్ నిల్వ, ఎలక్ట్రిక్ వాహన రంగాలపై ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

# ఉరిశిక్షను రద్దు చేయండి

- ఇతర సులువైన మరణశిక్ష విధానాలను అమలు చేయండి
- ఉరికి ప్రత్యామ్నాయంపై పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- మరణశిక్ష అమలుపై కీలక వ్యాఖ్యలు
- భవిష్యత్తులో శాస్త్రీయ ఆధారాలతో పరిశీలనకు అవకాశం

**న్యూఢిల్లీ:** ఉరిశిక్షకు బదులుగా నొప్పిలేని ప్రత్యామ్నాయ పద్ధతుల్లో మరణశిక్ష అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే ఇది తుది నిర్ణయం కాదని, భవిష్యత్తులో ప్రత్యామ్నాయ మరణశిక్ష విధానాలకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలు అందుబాటులోకి వస్తే ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ప్రస్తుతం రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని పేర్కొన్న కోర్టు.. మరణశిక్ష అమలు విధానంలో మార్పులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ కలిగి ఉందని తెలిపింది.



**2017లో పిల్ దాఖలు**

సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) ప్రకారం ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను అమలు చేయాలని పిటిషన్‌లో కోరారు. అనేక దేశాల్లో ఉరికి బదులుగా ఇతర విధానాల్లో మరణశిక్ష అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మరణశిక్ష అమలు విధానాలపై కేంద్రం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోందని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టుకు తెలిపారు. మరోవైపు విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం కూడా పూర్తిగా విజయవంతమైనది కాదని సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా వాదించారు. ఈ అంశంపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.



## ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

**ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటికే తొలి ప్రాధాన్యం**

- అందుబాటులో ఉన్న నిల్వలు, నమ్మదగిన ప్రవాహాల ఆధారంగానే సాగునీటి నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం, గోదావరిలో 68.1 శాతం నిల్వలు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



## ఇమ్రాన్‌ను ఆసుపత్రిలో చేర్పించండి

- తదుపరి విచారణ వరకు అక్కడే ఉండాలి
- వైద్య బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక చికిత్స అందించండి
- కుటుంబ సభ్యులతో వారానికి ఒకసారి భేటీకి అనుమతివ్వాలి
- పాక్ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

2

# ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటికే తొలి ప్రాధాన్యం
- అందుబాటులో ఉన్న నిల్వలు, నమ్మదగిన ప్రవాహాల ఆధారంగానే సాగునీటి నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం, గోదావరిలో 68.1 శాతం నిల్వలు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి ఉన్నందున ప్రతి నీటి చుక్కనూ ఆచితూచి వినియోగించాలని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తూనే.. అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ కల్పించాలని సూచించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్ సాగునీటి అవకాశాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో భారీ వర్షాలు, ఎగువ నుంచి వరదలు వస్తాయని ముందుగానే ఊహించి ప్రణాళికలు రూపొందించవద్దని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు, నమ్మదగిన ప్రవాహాలు, శాస్త్రీయ వర్షపాత అంచనాలనే నిర్ణయాలకు ప్రాతిపదికగా తీసుకోవాలన్నారు. స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఆశాజనకంగా ఉందనే భావన కల్పించరాదని, ప్రతి నివేదికలో లైవ్ స్టోరేజ్, వాస్తవ వినియోగయోగ్య నీరు, తాగునీటి అవసరాలు, సాగుకు మిగిలే నీటి వివరాలను స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించారు.

## కృష్ణా, గోదావరిలో నిల్వలు

కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాల్లో 973.68 టీఎంసీల సామర్థ్యానికి 746.12 టీఎంసీలు, అంటే 76.63 శాతం నీరు ఉన్నట్లు సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీలకు 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రాజెక్టు నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 164 టీఎంసీల నీరు ఉందని, దాని స్థూల సామర్థ్యం 312 టీఎంసీలు కాగా మరో 47 శాతం వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని వివరించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నందున సాగునీటి అవసరాలను జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. వైరా రిజర్వాయర్ సహా దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్, రామడుగు, పోచారం తదితర ప్రాజెక్టుల నీటి పరిస్థితిని సమీక్షించి, నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరులతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటి విడుదలలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. మూసీ జలాలను సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం కల్పించాలని సూచించారు.

## సింగూరు భద్రతకు ప్రాధాన్యం

సింగూరు ప్రాజెక్టు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయడంతో పాటు తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతినీ సమీక్షించారు. భద్రతకు రాజీపడకుండా పనుల వేగం పెంచాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపైనా మంత్రి సమీక్షించారు. ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాలు సమన్వయంతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి నీటి విడుదలకు శాస్త్రీయ కారణం ఉండాలని, తాగునీటి భద్రతతో పాటు రైతు ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఉత్తమ్ స్పష్టం చేశారు.

# క్లీన్ ఎనర్జీకి తెలంగాణ హబ్!

ప్రజానావ, హైదరాబాద్: అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. క్లీన్ ఎనర్జీ రంగానికి రాష్ట్రాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్, నోవాటెల్‌లో మంగళవారం ప్రారంభమైన 'ఇండియా ఎనర్జీ సమ్మిట్–ఎక్స్‌పో 2026'లో ఆయన ప్రసంగించారు. ఇంధన రంగంలో మార్పు కేవలం విద్యుత్ ఉత్పత్తి వనరులను మార్చడం కాదని, సమగ్ర ఆర్థిక వ్యవస్థను మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని భట్టి పేర్కొన్నారు. తెలంగాణను స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగానే కాకుండా.. ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని భట్టి తెలిపారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 26 వేల మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

## పెట్టుబడులకు ప్రోత్సాహకాలు

2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12 వేల ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి చెప్పారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తి సంస్థలకు మూలధన సాయం, పన్ను రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు వేగవంతమైన అనుమతులు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతోనే ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమని పేర్కొన్న భట్టి.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈవోలు తెలంగాణతో కలిసి నడవాలని ఆహ్వానించారు.



# కల్యాణలక్ష్మి, రైతుబీమా పథకాలను కొనసాగించాలి

- ఏదులలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, దిష్టిబొమ్మ దహనం

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: కేసీఆర్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు బీమా వంటి ఆదర్శవంతమైన పథకాలను ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ఏదుల మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టి, ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు దొడ్ల రాముడు, రమేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రాజూరెడ్డి, నాయకులు మాట్లాడు తూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి ఉన్న పథకాలకు ఎసరు పెడుతున్నారని విమర్శిం చారు. రైతుబీమా ప్రీమియంను ప్రభుత్వం సరైన సమయానికి చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసత్య ప్రచారాలు మాని, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అబ్దుల్ మహమూద్, విజయ్‌మోహన్, ప్రవీణ్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, ఆంజనేయులు, బిచ్చిరెడ్డి, సత్తార్, బంకల జాన్, దవడ రాములు, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాల మచ్చ!

- 44 నియామక పరీక్షలు రద్దు
- జార్ఖండ్ ప్రభుత్వ సంచలన నిర్ణయం
- జేపీఎస్సీ, జేఎస్ఎస్సీతో పాటు టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ నిర్వహించిన పరీక్షలూ రద్దు
- విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో చర్యలు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు ప్రతిపాదన

రాంచీ: నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థుల ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో జార్ఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2014 నుంచి నిర్వహించిన 44 నియామక పరీక్షలను రద్దు చేస్తూ మంగళవారం రాత్రి ఎనిమిది నోటిఫికేషన్లు జారీ చేసింది. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), ఔట్‌సోర్సింగ్ సంస్థ టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టీడీపీఎల్) నిర్వహించిన పరీక్షలు కూడా ఇందులో ఉన్నాయి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిప్యూటీ కలెక్టర్లు, డెంటల్ డాక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సివిల్ జడ్జిలు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల నియామక పరీక్షలు రద్దైన వాటిలో ఉన్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో లెక్చరర్లు, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లు, అసిస్టెంట్ కన్జర్వేటర్లు ఆఫ్ ఫారెస్ట్ తదితర పోస్టుల పరీక్షలూ రద్దయ్యాయి. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీలో జరిగిన అవకతవకలకు సంబంధించిన కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రెండు కమిషన్లలో అంతర్గత విజిలెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది.

## రెండు నెలల్లో సంస్కరణల నివేదిక

సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ నేతృత్వంలోని జేపీఎస్సీ–జేఎస్ఎస్సీ సంస్కరణల కమిటీ రెండు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం మేరకు విద్యార్థుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన జేఎస్ఎస్సీ–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్) పరీక్షను కూడా రద్దు చేశారు. టీడీపీఎల్ నిర్వహించిన అన్ని పరీక్షలు, ఆ సంస్థ ప్రకటించిన ఫలితాలను సైతం రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

ప్రజానావ, గోదావరిఖని: రేపు రామగుండంలో నిర్వహించనున్న భారీ సభకు సంబంధించిన ఏర్పాట్లను రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వేదిక, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు తాగునీరు, పార్కింగ్, వాహనాల రాకపోకలు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సభ విజయవంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

# 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి!

(మొదటిపేజీ తరువాయి)

భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలో చేరినట్లు తెలిపారు. 22ఏ భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు పొంగులేటి తెలిపారు. రాబోయే 15 రోజుల పాటు కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించి, అర్హత ఉన్న ప్రైవేట్ భూములను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

## చేతులు దులుపుకోలేదు

ప్రభుత్వం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుకుంటోందని, బాధ్యతను అధికారులపై నెట్టేసి చేతులు దులుపుకోదని మంత్రి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదన్నారు. 22ఏ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవద్దని, ప్రజల్లో అనవసర ఆందోళన కలిగించే ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రూ.230కే సిమెంట్ బస్తా

- ఇందిరమ్మ ఇళ్లకు అందించేందుకు పరిశ్రమల అంగీకారం
- పేదల సొంతింటి కల సాకారానికి భాగస్వాములు కండి
- సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలకు మంత్రి పొంగులేటి పిలుపు



ప్రజానావ, హైదరాబాద్: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిమెంట్‌ను తక్కువ ధరకు అందించాలని పరిశ్రమల యాజమాన్యాలను కోరగా.. మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన వారు ఒక్కో బస్తాను రూ.230కే అందించేందుకు అంగీకరించారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం ఇళ్ల నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే బృహత్తర కార్యక్రమమని అన్నారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, వాటిలో 85 శాతం ఇళ్లకు శ్లాబులు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల చొప్పున 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు పొంగులేటి వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు సమష్టిగా పనిచేస్తే తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వేగంగా సాధించవచ్చని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సిమెంట్‌ను రూ.230కే అందించేందుకు అంగీకరించిన పరిశ్రమల యాజమాన్యాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ పోరాటాలు

- సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో రాష్ట్ర మహాసభలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించే వరకు పోరాటాలు సాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026 సెప్టెంబరు 6, 7, 8 తేదీలలో కరీంనగర్ పట్టణంలో జరగనున్న ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 1886 చికాగో పోరాటాల నుంచి నేటి వరకు కార్మికులు సాధించుకున్న హక్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మహాసభలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కార్మికులు, శ్రేయోభిలాషులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నరసింహ, బి.లక్ష్మీ పతి, టి.శివుడు, శ్రీనివాసులు, శేఖర్, మధు, సైదులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

ప్రజానావ, మంచిర్యాల:187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హరిత ఫంక్షన్ హాల్‌లో మంచిర్యాల జిల్లా ప్రొఫెషనల్ ఫోటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొని రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, మంచిర్యాల జిల్లా ఫోటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూములపై బీఆర్ఎస్ 'జనతా గ్యారేజ్'

- నిషేధిత జాబితా నుంచి భూములు తొలగించే వరకు ప్రజలకు అండగా ఉంటాం
- ప్రభుత్వ తప్పులకు ప్రజలను ఎందుకు శిక్షిస్తారు?
- పొంగులేటి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజానావ, హైదరాబాద్: 22ఏ నిషేధిత జాబితాలో చేరిన భూములను తిరిగి విడిపించే వరకు ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు రిజిస్ట్రార్ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. ప్రజలు కష్టపడి సంపాదించిన, న్యాయబద్ధమైన భూములను సైతం 22ఏ జాబితాలో చేర్చారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ పనిచేయడం లేదని విమర్శించారు. ప్రజలకు అండగా తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, బీఆర్ఎస్ కార్యాలయాన్ని 'జనతా గ్యారేజ్'గా అభివర్ణించారు. గతంలో మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లను హైడ్రా కూల్చివేయకుండా బాధితులకు అండగా నిలిచామని, ఇప్పుడు 22ఏ భూముల విషయంలోనూ అదే విధంగా పోరాడతామని చెప్పారు.

## ప్రభుత్వ తప్పులకు ప్రజలకు శిక్షా?

ప్రభుత్వం, హెచ్ఎండీఏ విక్రయించిన భూములను కూడా రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్‌రావు ఆరోపించారు. 'మీరు చేసిన తప్పులకు ప్రజలను ఎందుకు శిక్షిస్తారు?' అని ప్రశ్నించారు. అధికారులు తప్పు చేశారని చెప్పి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోలేదన్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అధికారులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని, తప్పు నిర్ణయాలకు భవిష్యత్తులో వారే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. నిషేధిత భూముల అంశంపై ఎప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరిగినా ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు తెలిపారు. ప్రజల ఆస్తుల విషయంలో ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ప్రభుత్వ టోల్‌ఫ్రీ పనిచేయకపోయినా.. ప్రజల కోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు.



# భూ పంపిణీతోనే సామాజిక న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయమని, చేసేది మాత్రం ఆటవిక న్యాయమని కవిత విమర్శించారు. ప్రభుత్వంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదన్నారు. 16 మంది సభ్యుల మంత్రివర్గంలో ముగ్గురే బీసీలు ఎందుకున్నారని ప్రశ్నించారు. గత రెండేళ్లలో రూ.5.96 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయిస్తే బీసీల కోసం కేవలం రూ.5,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. ఆర్టీఐ కమిషనర్ల నియామకంలో ఒక్క బీసీకి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంటూనే మంత్రివర్గంలో ఇద్దరికి మాత్రమే చోటు కల్పించారని విమర్శించారు. సామాజిక న్యాయం కోసం సభలు, ధర్నాలు, ఆందోళనలతో ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కవిత తెలిపారు. తెలంగాణలో సామాజిక న్యాయం సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# పాపన్న పోరాటం అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఇరిగేషన్ కాల్వల వెంట ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తామని జోస్యం చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, 2029లోనూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు.

# లండన్, అమెరికా పర్యటనకు సీఎం రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు వివిధ ప్రతినిధి బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. విద్య, పరిశ్రమలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై చర్చలు జరపనున్నారు. ఆగస్టు 20 అర్ధరాత్రి 12.30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో లండన్‌కు బయలుదేరనున్న సీఎం.. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7 గంటలకు చేరుకుంటారు. 21న ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సందర్శిస్తారు. అనంతరం ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. 22న కేంబ్రిడ్జ్ బృందంతో సమావేశమై, లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్, లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు.

## అమెరికాలోనూ వరుస భేటీలు

ఆగస్టు 23న లండన్ నుంచి బోస్టన్‌కు చేరుకునే సీఎం.. 24న హార్వర్డ్ యూనివర్సిటీ, ఎంఐటీ క్యాంపస్‌లను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి న్యూయార్క్‌కు బయలుదేరుతారు. 25న నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీని సందర్శించి, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశమవుతారు. 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో పాల్గొని ప్రవాస భారతీయులు, వివిధ వర్గాల ప్రతినిధులతో భేటీ కానున్నారు. పర్యటన ముగించుకుని 29న న్యూయార్క్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి 30న నగరానికి చేరుకుంటారు. పర్యటనలో విద్య, పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించి రాష్ట్రానికి కొత్త అవకాశాలను అన్వేషించనున్నారు.



# మాట నిలబెట్టుకున్న ఆరపల్లి సర్పంచ్

- ఎన్నికల హామీని నెరవేర్చిన ఇటిక్యాల రాజు
- ఆడపిల్ల జన్మించిన దంపతులకు రూ.10,116 నగదు అందజేత

ప్రజానావ, వేములవాడ అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఆరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇటిక్యాల రాజు ఆదర్శంగా నిలిచారు. గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామంలో ఆడపిల్ల జన్మిస్తే రూ.10,116 అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తాజాగా గ్రామానికి చెందిన మంజెడి స్రవంతి–వినోద్ దంపతులకు ఆడపిల్ల జన్మించడంతో ఇచ్చిన మాట ప్రకారం రూ.10,116 నగదును అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను మరువకుండా అమలు చేసిన సర్పంచ్ రాజును గ్రామ పెద్దలు అభినందించారు. ఆడపిల్లలపై ప్రోత్సాహకరమైన సందేశాన్ని ఇచ్చేలా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రశాంత్, మాజీ సర్పంచ్ సిల్వేని మల్లేశం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఇటిక్యాల లింగయ్య, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

# భక్తి, సేవకు ఇస్కాన్ చిరునామా

- 50 ఏళ్ల అబిడ్స్ ఇస్కాన్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం
- స్వర్ణోత్సవ సందేశంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





ప్రజానావ హైదరాబాద్: అబిడ్స్‌లోని శ్రీశ్రీ రాధా మదనమోహన్ మందిరం ఐదు దశాబ్దాలుగా భక్తి, ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తోందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. అబిడ్స్‌లో నిర్వహించిన శ్రీశ్రీ రాధా మదనమోహన్ మందిరం స్వర్ణోత్సవ వేడుకల్లో గవర్నర్ తన సతీమణి జానకి శుక్లాతో కలిసి పాల్గొన్నారు. 1976లో ప్రారంభమైన మందిరం స్వర్ణోత్సవ వేడుకలకు విచ్చేసిన గవర్నర్ దంపతులకు ఇస్కాన్ నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీశ్రీ రాధా మదనమోహన్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఇస్కాన్ అబిడ్స్ 50 ఏళ్ల ప్రస్థానం కేవలం కాలగమనానికి సంబంధించినది కాదని, భక్తి, సేవ, సంస్కారం, కరుణ, మానవ సంక్షేమానికి అంకితమైన ఆధ్యాత్మిక ప్రయాణమని అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున ఇస్కాన్ సంతులు, భక్తులు, సేవకులు, శ్రేయోభిలాషులకు అభినందనలు తెలిపారు. 1966లో శ్రీల ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రారంభించిన ఇస్కాన్ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా కృష్ణభక్తి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని విస్తరిస్తోందని పేర్కొన్నారు. భగవద్గీత ద్వారా ఆత్మజ్ఞానం, భగవంతుడిపై ప్రేమ, నిస్వార్థ సేవా మార్గాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. అబిడ్స్ వంటి రద్దీ వాణిజ్య ప్రాంతంలో ఐదు దశాబ్దాలుగా ఈ మందిరం ఆధ్యాత్మిక శాంతి, సామరస్యం, సంస్కారం, సేవలకు కేంద్రంగా కొనసా గుతోందని ప్రశంసించారు. హరినామ సంకీర్తన, భగవన్నామ స్మరణ, ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజం లో మానవీయ విలువలను పెంపొందిస్తు న్నారని కొనియాడారు. యువత భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు చేరువ కావాలని, భగవద్గీతను చదివి అందులోని విలువలను జీవితంలో ఆచరించా లని గవర్నర్ పిలుపునిచ్చారు. భౌతిక ప్రగతితో పాటు ఆధ్యాత్మిక సమతుల్యత, ఆత్మనిగ్ర హం, కృతజ్ఞత, కరుణ అవసరమని చెప్పారు. 'వసుధైవ కుటుంబకం' భారతీయ సంస్కృతి గొప్ప సందేశమని, ప్రపంచాన్ని ఒక కుటుంబంగా భావించి సేవ, సామరస్య భావనలను పెంపొందించుకోవాలని సూచించారు. 'హరే కృష్ణ' మహామంత్ర సంకీర్తన మనసుకు ప్రశాంత తను, జీవితానికి సానుకూల శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు. శ్రీశ్రీ రాధా మదనమోహన్ స్వామివారి కృపతో ఇస్కాన్ అబిడ్స్ మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. రాబోయే దశాబ్దాల్లోనూ ఈ మందిరం ధర్మం, భక్తి, సేవ, సంస్కారం, మానవ సంక్షేమానికి దీపస్తంభంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇస్కాన్ నిర్వాహకులు గవర్నర్ దంపతులను ఘనంగా సత్కరించి స్వర్ణోత్సవ మెమెంటోను బహూకరించారు. వేడుకల్లో ఆధ్యాత్మిక గురువు లోక్‌నాథ్ స్వామిజీ, శ్రీ వరద్ కృష్ణ దాస్ జీ, శ్రీ మహామన్ దాస్ జీ, శ్రీ సీతారామ్ దాస్ జీ, శ్రీమతి రేవతి రమణ దాస్ జీ, పూజ్య సంతులు, ఇస్కాన్ నిర్వాహకులు, భక్తులు, విశిష్ట అతిథులు పాల్గొన్నారు. హరే కృష్ణ నామస్మరణతో ఇస్కాన్ అబిడ్స్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# పెద్ది విగ్రహం తొలగింపుపై నల్లబెల్లిలో నిరసనలు

- ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనం
- ఉద్రిక్తంగా మారిన నల్లబెల్లి

ప్రజానావ నల్లబెల్లి: మెడికల్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు భారీ బందోబస్తు మధ్య తొలగించడాన్ని నిరసిస్తూ నల్లబెల్లి మండలంలో ఆందోళనలు చేపట్టారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం సమీపంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడంతో మండల కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా నారక్కపేట గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపును నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. పరిస్థితులు అదుపు తప్పకుండా పోలీసులు నారక్కపేటతో పాటు ఇతర గ్రామాల్లోనూ భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు.

## సునహరి మిట్టి అభియాన్

# ప్రారంభోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం

- నిజామాబాద్‌లో పసుపు మార్కెట్ లింకేజీ కార్యక్రమం
- ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ జాతీయ సదస్సుకు కూడా ఆహ్వానం

ప్రజానావ హైదరాబాద్: నిజామాబాద్‌లో నిర్వహించనున్న పసుపు మార్కెట్ లింకేజీ కార్యక్రమం 'సునహరి మిట్టి అభియాన్' ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, నేషనల్ టర్మరిక్ బోర్డు చైర్‌పర్సన్ పల్లె గంగారెడ్డి, కార్యదర్శి భవానీతో కూడిన ప్రతినిధి బృందం ఆహ్వానించింది. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ప్రతినిధులు ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నిజామాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి గవర్నర్ హాజరు కావాలని కోరారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా 'నషా ముక్త్ యువ ఫర్ నిజామాబాద్' ప్రచార కార్యక్రమంతో పాటు అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పలు కార్యక్రమాలకు కూడా గవర్నర్‌ను ఆహ్వానించారు. ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ జాతీయ సదస్సుకు ఆహ్వానం: హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఆహ్వానించారు. లోక్‌భవన్‌లో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసింది. జాతీయ స్థాయిలో మీడియా ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల పనితీరు తదితర అంశాలపై గవర్నర్ సందేశం, మార్గదర్శనం అందించాలని ప్రతినిధులు కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ సదస్సుకు దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టులు హాజరుకానున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

# పెండింగ్ భూ సేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజానావ, పెద్దపల్లి : అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములతో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, తదితర అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించా రు. భూ యజమానులకు సంబంధించిన సమస్యలు, భూ వివరాల పరిశీలన, రికార్డుల పరిశీలన, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను వేగవంతం చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ కీలకమైనందున, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణ సజావుగా జరిగేలా అవసరమైన చోట భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల పురోగతికి భూ సేకరణ కారణంగా ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కూనారం ఆరోబీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అక్టోబర్ 15 నాటికి రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసి వాహనాల రాకపోకలు జరిగే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో ఆర్ అండ్ బి ఈఈ. భావ్ సింగ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు బి. గంగయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కామారెడ్డికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
- కామారెడ్డిని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

ప్రజానావ, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఏర్పాటు చేసేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడగా, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని షబ్బీర్ తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా కామారెడ్డి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నం.145 ద్వారా కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి రూ.200 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సమీకృత వసతి పాఠశాలలో ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా సదుపాయాలు, వసతి, భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. ఈ పాఠశాల కామారెడ్డి విద్యార్థులకు గొప్ప అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కామారెడ్డిని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా రూ.200 కోట్ల ప్రాజెక్టు మరో కీలక ముందడుగు అని షబ్బీర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తామని, నియోజకవర్గ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కామారెడ్డి నియోజకవర్గంలోనే నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాస రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కేటింగ్‌లో విద్యార్థుల జాతీయ రికార్డు

## ఎస్పీ అభినందనలు

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో : హైదరాబాద్‌లోని బౌరంపేట్‌లో మిషన్ స్కేటింగ్ అకాడమీ పూణే ఆధ్వర్యంలో నిర్వహించిన 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్ ఈవెంట్‌లో వనపర్తి జిల్లాకు చెందిన 32 మంది విద్యార్థులు జాతీయ స్థాయి రికార్డు సాధించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఎటువంటి విరామం లేకుండా స్కేటింగ్ చేసి తమ ప్రతిభను చాటారు. రికార్డు సాధించిన విద్యార్థులు, కోచ్ రాథోడ్ కిషన్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు చేసిన స్కేటింగ్ విన్యాసాలను ఎస్పీ తిలకించి ముగ్ధులయ్యారు. చిన్న వయసులోనే క్రమశిక్షణ, పట్టుదలతో జాతీయ రికార్డు నెలకొల్పడం జిల్లాకే గర్వకారణమని ఎస్పీ ప్రశంసించి, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, కోచ్‌ను అభినందించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు అందరికీ ఆదర్శం

- బహుజన వీరుడి పోరాట స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలి
- సినీ నటుడు సుమన్

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: బహుజన వీరుడు, ధైర్యసాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట పటిమ నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని ప్రముఖ సినీ నటుడు సుమన్ గౌడ్ అన్నారు. ప్రజల హక్కుల కోసం, సమాజ శ్రేయస్సు కోసం పాపన్న గౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అశ్వారావుపేటలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుమన్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సుమన్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో సుమన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, గౌడ సంఘం నాయకులు, యువత, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# సంక్షేమ పథకాల రద్దు కుట్రలను తిప్పికొడతా

## మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో : కేసీఆర్ హయాంలో మహిళలకు ఆర్థిక భరోసా, ఆత్మగౌరవాన్ని అందించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వీటిని ఆపే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ కుట్రలపై బి.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన కదనభేరి నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం హైకోర్టులో కావాలనే కౌంటర్ దాఖలు చేయకుండా అలసత్వం వహిస్తూ, దశలవారీగా పథకాల లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తూ రద్దుకు దారులు వెతుకుతోందని ఆరోపించారు. రేవంత్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం పడకేసిందని, రైతులకు సాగునీరు అందించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం రూ. 4వేల ఆసరా పింఛన్, రూ. 2,500 మహిళా భరోసా బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. బి.ఆర్.ఎస్ నిరసనలకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పోరాట స్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ప్రజానావ, పెద్దపల్లి : తెలంగాణ గడ్డపై వీరత్వానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన తొలి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతిని పురస్కరించుకొని జూలపల్లి మండలం తెలుకుంట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని గౌడ సంఘం సోదరులతో కలిసి ఆవిష్కరించిన తదుపరి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ చైర్మన్లు, పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు గౌడ సంఘం నాయకులు, యూత్ నాయకులు, గ్రామ గౌడ సంఘం పెద్ద మనుషులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపురం ముంపు గ్రామాల నిర్వాసితులకు రూ.206 కోట్ల నిధులు విడుదల

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూసేకరణకు నిధులు
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు



ప్రజానావ, యాదాద్రి భువనగిరి: బస్వాపురం రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూసేకరణ కోసం రూ.206 కోట్ల నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయడంతో గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న ముంపు గ్రామాల నిర్వాసితులకు ఊరట లభించనుందని పేర్కొన్నారు. బస్వాపురం రిజర్వాయర్ పూర్తయితే సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భువనగిరి, వలిగొండ, నకిరేకల్, రామన్నపేట మండలాల రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడు తుందని తెలిపారు. ముంపు గ్రామాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిధులు విడుదల చేయడంలో సహకరించిన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# శనాయిపల్లిలో ఘనంగా బోనాల ఉత్సవాలు

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని శనాయిపల్లి గ్రామంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మహిళలందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి, తలపైన మంగళహారతులు, వర్ణరంజితంగా అలంకరించిన బోనాలెత్తుకొని ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మోతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో గ్రామ ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

భారత్ లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను ప్రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనా లు దెబ్బతిన్నాయి. ఎన్ఎస్జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సపూపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా.. ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి.

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సపూపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్‌ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి డా దీనిని గుర్తించింది. భారత్ లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను ప్రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనా లు దెబ్బతిన్నాయి. ఎన్ఎస్జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సపూపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గావ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. వలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు డా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశం లో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదుల తో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది వలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో.. ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు.. తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంత రం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు.. తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

EDITORIAL

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ కె. హైమావతి




**ప్రజానావ సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిరోధక చట్టం–2006 అమలుపై సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూల నకు చేపట్టాల్సిన చర్యలు, శాఖల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చట్టపరమైన అంశాలపై అవగాహన పెంచా లని, బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, విద్యాపరమైన నష్టాలను తల్లిదండ్రు లకు వివరించాలని అన్నారు. గ్రామా ల్లో బాల్య వివాహాలను అరికట్టడంలో సర్పంచులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీపీలు, సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాల్లో వివాహాలు నిర్వహించే సమయంలో వధూవరుల వయస్సుకు సంబం ధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. అనుమానాస్పద వివాహాలపై వెంటనే విచారణ జరిపి బాల్య వివాహంగా తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణలో విద్యాశాఖ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరుకాని విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్యంగా బాలికలు అకస్మాత్తుగా పాఠశా లకు దూరమైతే ప్రత్యేక దృష్టి సారించి వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. కుటుంబ ఆర్థిక సమస్యలు కూడా బాల్య వివాహాలకు కారణమ వుతున్నందున అలాంటి కుటుంబాలను గుర్తించి ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని అన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిస్తే బాల్య వివాహాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిరోధక కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, సమాచారం అందించే వ్యవస్థను మరింత బలోపేతం చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించా లని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేసినప్పుడే బాల్య వివాహాల నిరోధక చట్టం–2006ను సమర్థవంతంగా అమలు చేయగలమని పేర్కొంటూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి పురోగతిని సమీక్షించాలని సూచించారు. ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహించే శానిటేషన్ డ్రైవ్‌ల సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్ర మాలు చేపట్టాలని, గ్రామాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో బాల్య వివాహాల నిరోధక చట్టం–2006తో పాటు పిల్లలకు కల్పించిన హక్కులపై విద్యార్థుల కు అవగాహ న కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉంటే బాల్య వివాహా లను ముందుగానే గుర్తించి అడ్డుకునే అవకాశం ఉంటుం దని తెలిపారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్ అందె వెంక టేశ్వర్లు బాల్య వివాహాల నిరోధక చట్టం–2006పై అధికారులకు సవివరంగా అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన వాయిస్ ఓవర్, వాల్ పోస్టర్లను కలెక్టర్ కె. హైమావతి ఆవిష్కరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామ ని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో బాల్య వివాహాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ రమేష్, డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్, జిల్లా సంక్షేమ అధికారి శారద, డీపీఓ రవీందర్, రిసోర్స్ పర్సన్ అందె వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## గట్టు, గుడ్డెందొడ్డి నిధుల కేటాయింపుపై సీఎం రేవంత్‌కు సన్మానం

- గద్వాలకు నీటిపారుదల నిధులు
- గద్వాల నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాదే: సీఎం రేవంత్
- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సన్మానం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** గట్టు ఎత్తిపోతల, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ల సామర్థ్యం పెంపునకు క్యాబినెట్‌లో నిధులు కేటాయించినందుకు గాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్డి లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని, ప్రత్యేక నిధులు కేటాయించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గట్టు సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు, గుడ్డెందొడ్డి సామర్థ్యాన్ని 1.9 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచి నిధులు మంజూరు చేయడం ద్వారా నియోజకవర్గంలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, రైతాంగానికి శాశ్వతంగా నీటి సమస్య తీరుతుందని ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు, రైతుల తరఫున సీఎంకు, క్యాబినెట్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



## జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి

**సిద్దిపేట–రామాయంపేట బైపాస్ పనులపై అధికారులతో ఎంపీ రఘునందన్‌రావు సమీక్ష**

**ప్రజానావ సిద్దిపేట:** సిద్దిపేట బైపాస్, రామాయంపేట ఫారెస్ట్ మధ్య రామాయంపేట బైపాస్ ప్రాంతంలో జాతీయ రహదారి 765 డీజీపై నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి అథారిటీ అధికారులు, కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులతో ఎంపీ సమీక్ష సమావేశం నిర్వహించి రహదారి నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితి, పనులు నిలిచిపోవడానికి గల కారణాలు, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు.

## ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమీక్షలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
- రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం




**ప్రజానావ నల్గొండ:** దేవరకొండ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి పారుదల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కోరారు. నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. దేవరకొండ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని బాలు నాయక్ తెలిపారు. సాగునీటి లభ్యత పెరగడంతో ప్రస్తుతం వర్షాధారంగా సాగు చేస్తున్న అనేక ప్రాంతాలకు భరోసా ఏర్పడుతుందని, సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటలను సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు నిండడంతో పాటు భూగర్భ జలాలు సమృద్ధి చెందే అవకాశం ఉందని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బాలు నాయక్ తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తోందన్నారు. రైతులకు సాగునీరు అందించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గ రైతుల చిరకాల సాగునీటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయి సాగునీరు అందుబాటులోకి వస్తే దేవరకొండ నియోజకవర్గం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించడంతో పాటు రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల పనులకు అవసరమైన అనుమతులు, నిధులు, ఇతర పరిపాలనా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## పలు కుటుంబాలకు మాజీ ఎంపీ నామా పరామర్శ

- మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం నగరంలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పరామర్శించి, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా ముస్తఫానగర్‌కు చెందిన బొమ్మ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సత్యప్రసాద్ మృతి నేపథ్యంలో ఆయన తండ్రి, బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వరరావుతో పాటు కుటుంబ సభ్యులను నామ నాగేశ్వరరావు పరామర్శించారు. అక్కడ సత్యప్రసాద్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం గట్టయ్య సెంటర్‌లో నిర్మల్ హృదయ్ స్కూల్ ఫౌండర్, కరస్పాండెంట్ సాంబశివరెడ్డి మృతి నేపథ్యంలో ఆయన స్వగృహానికి వెళ్లి కుమారులు సుధాకర్‌రెడ్డి, రవి భరత్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాంబశివరెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్యాంక్ కాలనీకి చెందిన అట్లూరి చంద్రశేఖర్‌రావు భార్య సులోచన మృతి నేపథ్యంలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సులోచన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు నామ నాగేశ్వరరావు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, ఖమ్మం కార్పొరేషన్ బీఆర్ఎస్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బుల్, మాజీ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, నాయకులు కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, మరికంటి రేణుబాబు, అమరగాని వెంకన్న, మన్నేపల్లి వెంకటేశ్వరరావు, బండారు శ్రీను, పరమేశ్వరరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందా?

- రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పై చిన్నారెడ్డి వ్యాఖ్యలు
- చిన్నారెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ వనపర్తి ఎమ్మెల్యే.. మేఘా రెడ్డి
- చిన్నారెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాల్సిందే: ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆగ్రహం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో :** కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డిపై తక్షణమే క్రమశిక్షణా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లిన మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు కన్నతల్లి వంటిదని, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా చిన్నారెడ్డి మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందంటూ విమర్శలు చేయడం కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తుం దని, ఇలాంటి చర్యలు పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ, చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. సమగ్ర విచారణ చేపట్టి, అధిష్టానంతో చర్చించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దేవరకద్ర మున్సిపాలిటీ, మండల



రైతులకు వ్యవసాయం కోసం 40 ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు ఏబీ స్విచ్‌లు, వైర్లు, పోళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గానికి ప్రభుత్వం 800 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని, మొదటి విడతగా 40 అందించామని, మరో పది రోజుల్లో ఇంకో 60 ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని తెలి పారు. ఈ కార్యక్ర మంలో ప్రజాప్రతి నిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు ఆటంకం కలగొద్దు

- బాలానగర్ పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ జానకి
- కేసుల విచారణ వేగవంతం చేయాలి

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో :** జిల్లా ఎస్పీ డి.జానకి మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎస్‌లోని కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులు, బీట్ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్–44పై బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల దృష్ట్యా వాహనదారులకు, అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు. పీక్ అవర్స్‌లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తూ, మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



# ఆషాఢ మాసంలో రికార్డు స్థాయిలో భీమేశ్వర స్వామి ఆలయానికి హుండీ ఆదాయం

- రూ.2.31 కోట్ల నగదు
- 137 గ్రాముల మిశ్రమ బంగారం,
- 9.2 కిలోల మిశ్రమ వెండి లభ్యం

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి ఆషాఢ మాసంలో రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. ఆలయ చరిత్రలో ఆషాఢ మాసంలో ఇంత భారీ స్థాయిలో హుండీ ఆదాయం రావడం ఇదే తొలిసారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. గత 47 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకల హుండీని లెక్కించగా రూ.2,31,38,480 నగదు లభించింది. అదేవిధంగా 137 గ్రాముల 300 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 9 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ గణనీయంగా పెరగడంతో హుండీ ఆదాయం కూడా భారీగా పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియను ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, డీఈవో నవీన్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. ఆషాఢ మాసంలో భక్తుల నుంచి లభించిన విశేష ఆదరణ, స్వామివారిపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలకు ఈ హుండీ ఆదాయం నిదర్శనమని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల సంఖ్యతో పాటు కానుకల సమర్పణ పెరగడంతో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం మరోసారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుకుందని పీఆర్వో పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

# గెస్ట్ ఆర్టిస్ట్‌లా కేటీఆర్.. టూరిస్ట్ స్పాట్‌గా సిరిసిల్ల!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తీరుపై బీజేపీ వినూత్న ఫిర్యాదు.
- అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన సిరిసిల్ల పట్టణ బీజేపీ
- క్యాలెండర్‌లో ఆ రెండు రోజులు ఎప్పుడొస్తాయంటూ నిలదీత



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజకీయాల్లో విమర్శలు సహజం.. కానీ ఆ విమర్శలకు కాస్త వెటకారం, ఇంకాస్త సృజనాత్మకత తోడైతే అది జనాల్లోకి బలంగా వెళ్తుంది. సరిగ్గా ఇలాంటి అస్త్రమే ప్రయోగించింది సిరిసిల్ల బీజేపీ. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే. తారకరామారావు పై వినూత్న రీతిలో నిరసన గళం విప్పింది. తమ ఎమ్మెల్యేకి సద్బుద్ధి ప్రసాదించాలంటూ ఏకంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కే ఓ లేఖ రాస్తూ.. కేటీఆర్ తీరుపై సెటైరికల్ గా విరుచుకు పడింది. ఈ మేరకు మంగళవారం సిరిసిల్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి ఈ వినతి పత్రాన్ని అందజేశారు. వారానికి రెండు రోజులు సిరిసిల్లలోనే పడుకుంటా.. మీ కష్టసుఖాల్లో తోడుంటా అంటూ 2023 ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తూ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కేటీఆర్ ఇచ్చిన ఎమోషనల్ హామీని ఆ లేఖలో గుర్తుచేశారు. కేటీఆర్ ను ఎన్ఆర్ఐ ఎమ్మెల్యేగా అభివర్ణిస్తూ సిరిసిల్ల ఆయనకు ఒక నియోజకవర్గంలా కాకుండా వీకెండ్ టూరిస్ట్ స్పాట్ లా, పిక్నిక్ స్పాట్ లా మారిపోయిందని విమర్శించారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

- ఆన్‌లైన్‌లో బుకింగ్ పూర్తయినా సొసైటీలో నో స్టాక్
- కామారెడ్డి, బాన్సువాడ ప్రధాన రహదారిపై రైతుల ధర్నా



**ప్రజానావ, కామారెడ్డి:** గాంధారి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ యాప్‌లో రైతులు ముందుగానే యూరియాను బుక్ చేసుకున్నప్పటికీ, బుకింగ్ పూర్తయిన అనంతరం ఎరువుల కోసం గాంధారి సొసైటీకి వెళ్లగా స్టాక్ లేదని సిబ్బంది చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రక్రియ పూర్తయినప్పటికీ క్షేత్రస్థాయిలో యూరియా అందుబాటులో లేకపోవడం పై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముందుగానే యూరియా బుక్ చేసుకున్న తమకు ఎరువులు ఎందుకు అందుబాటులో లేవని సొసైటీ సిబ్బందిని ప్రశ్నించారు. సమయానికి యూరియా అందకపోతే పంటలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు గాంధారి సొసైటీ ఎదుట కామారెడ్డి–బాన్సువాడ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. తాము బుక్ చేసుకున్న యూరియాను సకాలంలో అందించే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని సముదాయిం చడంతో వారు ధర్నాను విరమించారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గాంధారి సొసైటీకి సరిపడా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచడంతో పాటు ఆన్‌లైన్‌లో ముందస్తుగా బుకింగ్ చేసుకున్న రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు.. సీఆర్ఆర్‌టీ వరం

## అవగాహన కార్యక్రమంలో మెడికవర్ వైద్యుల వెల్లడి

**ప్రజానావ, సిరిసిల్ల :** అవయవాల పనితీరు దెబ్బతిని ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ (సీఆర్ఆర్‌టీ) ఆధునిక ప్రాణరక్షక చికిత్సగా నిలుస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సాధారణ డయాలసిస్‌ను తట్టుకోలేని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఈ చికిత్స ఆశాకిరణంగా మారుతోందని వారు వెల్లడించారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో సీఆర్ఆర్‌టీ యంత్రం పనితీరు, వినియోగం, ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు వివరించారు. తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు ఒక్కసారిగా దెబ్బతినడం సాధారణమేనని, అలాంటి సమయంలో సాధారణ డయాలసిస్‌ను తట్టుకునే పరిస్థితి చాలామందికి ఉండదని వైద్యులు తెలిపారు. అలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సీఆర్ఆర్‌టీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ అత్యాధునిక యంత్రం ద్వారా రోగికి అవసరమైన బీపీ మందులను కొనసాగిస్తూ 24 గంటలపాటు నిరంతరాయంగా డయాలసిస్ నిర్వహించవచ్చని వివరించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో సీఆర్ఆర్‌టీ యంత్రాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఇప్పటివరకు పలువురు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులను వైద్య బృందం సమిష్టి కృషితో కాపాడగలిగామని వారు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి సరైన చికిత్స అందించడం, నిపుణుల పర్యవేక్షణలో ఆధునిక వైద్య సాంకేతికతను వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యం అవుతున్నాయని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మనోజ్, లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.

# కేయూ @ 50.. అర్ధ శతాబ్దపు విద్యా ప్రస్థానం

- లక్షలాది మందికి ఉన్నత విద్య
- వేలాది మంది మేధావుల ఆవిష్కరణ
- జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలతో ముందుకు




**ప్రజానావ, వరంగల్:** ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఉన్నత విద్యకు కేరాఫ్‌గా నిలిచిన కాకతీయ యూనివర్సిటీ అర్ధ శతాబ్దపు ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాల్లోకి అడుగుపెడుతోంది. 1976 ఆగస్టు 19న ఏర్పాటైన కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భావం నుంచి నేటి వరకు వివిధ పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర అనేక కోర్సుల ద్వారా లక్షలాది మందికి ఉన్నత విద్యను అందించింది. వేలాది మంది పరిశోధకులు, మేధావులు, రాజకీయ నాయకులను తీర్చిదిద్దిన కేయూ ఐదు దశాబ్దాల కాలంలో అంచెలంచెలుగా అభివృద్ధి చెంది జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకునే స్థాయికి చేరుకుంది. విశ్వవిద్యాల యం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు 14 మంది వైస్‌చాన్సలర్లు బాధ్యతలు నిర్వహించారు. సామాజిక ఉద్యమాలకు పుట్టినిల్లు: కేయూలో విద్యనభ్యసించిన విద్యార్థులు, బోధించిన అధ్యాప కులు అనేక సామాజిక, అస్తిత్వ ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో పాటు మానవ హక్కుల, దళిత, బహుజ న ఉద్యమాలకు కూడా కేయూ వేదికగా నిలిచింది. అర్ధ శతాబ్దమైనా సమస్యలు: యూనివర్సి టీ 50వ వసంతంలోకి అడుగుపెడుతున్నప్పటికీ విద్యార్థులు ఇప్పటికీ కనీస వసతుల కొరతతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థినుల హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలం టూ ఇటీవల నిరసనలు జరిగాయి. యూనివ ర్సిటీలో చదువుతున్న విద్యార్థులందరికీ హాస్టల్ వసతి అందుబాటులో లేకపోవడం గమనార్హం. మరోవైపు ప్రొఫెసర్ పోస్టులతో పాటు ఇతర సిబ్బంది పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరుతున్నారు. నేడు స్వర్ణోత్సవ వేడుకలు: కాకతీయ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని స్వర్ణోత్సవ వేడుకలను బుధవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ పరిపాలనా భవనం లోని సెనెట్ హాల్‌లో నిర్వహిం చనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం తెలిపారు. కేయూ 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విద్యా, పరిశోధనా విజయా లు, సంస్థాగత అభివృద్ధి, ఉన్నత విద్యారం గానికి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించు కోనున్నట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రస్థానం, విజయాలు, భవిష్యత్ దార్శనికతపై వైస్‌చాన్సలర్ ప్రొ. కే. ప్రతాప్‌రెడ్డి ప్రసంగించను న్నట్లు తెలిపారు. కేయూ వారసత్వాన్ని స్మరించు కుంటూ విద్యా నాణ్యత, పరిశోధన, సంస్థాగత అభివృద్ధి పట్ల నిబద్ధతను పునరుద్ఘాటించే ఈ వేడుకల్లో బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని రిజిస్ట్రార్ విజ్ఞప్తి చేశారు.

# సిరిసిల్లలో భారీ అగ్ని ప్రమాదం

- ఒకరు సజీవ దహనం, ప్రాణాలతో బయటపడిన ముగ్గురు కూలీలు
- ఫర్నిచర్ షాపు, గోదాములో చెలరేగిన మంటలు
- మూడు ఫైర్ ఇంజన్లతో మంటల నియంత్రణకు శ్రమించిన సిబ్బంది
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ, బీఅర్ఎస్ నేతలు







**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు ప్రధాన రహదారి లోని మహాలక్ష్మి ఫర్నిచర్ షాప్, గోదాములో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఒకరు సజీవ దహనం అయ్యారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ ప్రమాద ఘటనలో ఉత్తర ప్రదేశ్ కు చెందిన కూలీ మహమ్మద్ ఇస్లాం గా గుర్తించారు. భారీ ఎత్తున ఎగిసిపడిన మంటలతో ఫర్నిచర్ షాప్, గోదాములో నలుగురు ఉత్తర ప్రదేశ్ కు చెందిన కూలీలు నిద్రిస్తుండగా ముగ్గురు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. అందులో చిక్కుకున్న మరో కూలి ఇస్లాం భారీగా చెల్లరేగుతున్న మంటల్లో ఖాళీ సజీవ దహనం అయ్యాడు. అగ్ని ప్రమాదానికి గురైన మహాలక్ష్మి ఫర్నిచర్ షాప్ యజమాని సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ అడ్డగట్ల దేవదాసు కు చెందినది కాగా ఈ ప్రమాదంలో సుమారుగా 50 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదం షాక్ సర్క్యూట్ తో జరిగిందా లేదా ఎవరైనా కావాలని చేశారా అని అనుమానాలను షాపు యజమాని వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఫర్నిచర్ షాప్‌లో ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచా రం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని చెలరేగుతున్న మంట లను అదుపులోకి తెచ్చే చర్యలు చేపట్టారు. ఫర్నిచర్ షోరూంలో ఎగసిపడుతున్న మంటలకు ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం అయింది. సుమారు రెండు గంటలుగా మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఘటనా స్థలంలో మూడు ఫైర్ యంత్రాలు ఉన్నా నీరు సరిపోకపోవడంతో పక్కనే ఉన్న గుంతలోని నీటిని వినియోగిస్తూ మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది ప్రయ త్నించారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో సహాయక చర్యలు కొనసాగిం చారు. జేసీబీ సహాయంతో సిబ్బంది గోడ, షట్టర్ బద్దలు కొట్టారు. భారీగా ఎగిసిపడుతు న్న మంటలతో పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఘటనా స్థలానికి స్థానిక సీఐ శ్రీనివాస్, పోలీసులు చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పరిశీలించారు. సిరిసిల్ల పట్టణంలో జరిగిన అగ్ని ప్రమాద సంఘటనను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పార్టీ నాయకు లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి ప్రమాదంలో మరణించిన వారి వివరాలను, ప్రమాద కారణాలను తెలుసుకుని బాధితులతో మాట్లాడారు. వీరి వెంట అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, కౌన్సిలర్ బూర బాలు, మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, కొండ శంకర్ లు ఉన్నారు.



# ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

**ప్రజానావ, గంభీరావుపేట :** తెలంగాణ బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. మండల గౌడ సంఘం అధ్యక్షులు చేరాల వెంకటస్వామి గౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజా హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు పాపగారి వెంకటస్వామి గౌడ్, బంగ్లా రాజు గౌడ్, చేరాల రాజాగౌడ్, లక్ష్మీపురం రాజు గౌడ్, పాప గారి యాదగిరి గౌడ్, లక్ష్మీపురం ప్రకాష్ గౌడ్, పాపగారి రాజు గౌడ్, పాప గారి శ్రీనివాస్ గౌడ్, లింగంపల్లి అంజా గౌడ్, కోల నాంపల్లి గౌడ్, చేరాల రాజు, గుర్రం రాజు గౌడ్, చేరాల అరవింద్ గౌడ్, గుర్రం నాగరాజ్ గౌడ్, లింగంపల్లి పరశురాములు, గొల్లపల్లి నాగరాజు గౌడ్, సాయబుగారి స్వామి పలువురు గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాదులో జరిగే పాపన్న విగ్రహావిష్కరణకు తరలి వెళ్లారు.




# సర్ డ్రాఫ్ట్ ఓటర్ జాబితాపై బీఎల్‌ఏలకు దిశానిర్దేశం

## అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అప్రమత్తంగా పనిచేయాలి

**ప్రజానావ, పెద్దపల్లి :** ఎస్ఐఆర్ లో భాగంగా ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదలైన నేపథ్యంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఎల్‌ఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్ పరిధిలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ పేరు జాబితాలో రాని వారు, పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్న వారు, చిరునామా మార్పు జరిగిన వారు ఎవరైనా ఉంటే గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. పేరు జాబితాలో లేని అర్హులైన వారికి ఫారం–6, ఓటరు వివరాల్లో సవరణలకు ఫారం–8, నిబంధనల ప్రకారం అనర్హమైన/డూప్లికేట్ నమోదులపై అభ్యంతరాలకు ఫారం–7 ద్వారా దరఖాస్తు చేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన ఫారాలను పూరించడంలో సహాయం చేసి, సంబంధిత బిఎల్ఓలకు అందజేయడంతో పాటు అందుబాటులో ఉన్న అధికారిక ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేలా కూడా సహకరించాలని అన్నారు. ప్రతి కుటుంబంలోని ఓటర్ల పేర్లను పరిశీలించడంతో పాటు కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా ప్రత్యేకంగా పరిశీలించాలని బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఏలతో పాటు ఆయా మండలాల మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో 97ను రద్దు చేయాలి

- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్, కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం




**ప్రజానావ, పెద్దపల్లి :** పాలిటెక్నిక్ విద్యావ్యవ స్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ రోడ్ ట్రినిటీ పాఠశాల నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఆజాద్, రేణుకుంట్ల ప్రీతం లు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ఎం ప్రత్యేక వ్యవస్థ అని పేర్కొన్నారు. దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు ప్రభుత్వం పూనుకుంటుందనీ పాలిటెక్నిక్ కళాశాల ను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించా లని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను ఉపసంహరించుకోవాలని రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపింది కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు వేయలేదని తాజాగా ఐటిఐలు, ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ ఆలోచన విధానం సరికాదని దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతూ ఉంటే అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం చూస్తూ ఊరుకోనేదే లేదన వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇలాంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతరాని నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకుల భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ, వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీక రణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా నాయకులు తడిగొప్పుల అను సాయి, ఆర్నకొండ ఆదిత్య, వెంకటేశ్వర్లు, జశ్వంత్, రోహిత్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

- నివాళులర్పించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు



**ప్రజానావ, సిరిసిల్ల :** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడు కలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరైపాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గౌడ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు విరాళం

**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనుల కోసం హైదరాబాద్‌లోని మల్కాజిగిరికి చెందిన శ్రీమతి ఖమ్మంపాటి శ్యామల– శ్రీకాంత్ దంపతులు రూ.1 లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కును దేవస్థానం ప్రోటోకాల్ కార్యాలయంలో ప్రజాసంబంధాల అధికారి (పీఆర్‌ఓ) పెరుక శ్రీనివాస్‌కు వారు అందజేశారు. అనంతరం దంపతులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందించి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అకౌంట్స్ విభాగం అడ్వైజర్ ఆగమ రావు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



# 2కోట్ల మంది విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్

- 1.6 లక్షల పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్
- 5-17 ఏళ్ల వారికి సెప్టెంబర్ 30 వరకు ఉచితం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల ఆధార్ తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ)లో భాగంగా 2 కోట్లకు పైగా పిల్లల వివరాలను అప్‌డేట్ చేసినట్లు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) మంగళవారం వెల్లడించింది. ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు 1.6 లక్షల పాఠశాలలను కవర్ చేసినట్లు తెలిపింది. పిల్లలకు 5 ఏళ్లు నిండినప్పుడు, ఆ తర్వాత 15 ఏళ్ల వయసులో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయడం తప్పనిసరి. ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదు సమయంలో పేరు, ఇతర జనాభా వివరాలు, ఫొటో మాత్రమే తీసుకుంటారు. ఆ వయసులో వేలిముద్రలు, కనుపాపల వివరాలు అభివృద్ధి చెందుతున్నందున బయోమెట్రిక్ వివరాలను నమోదు చేయరు. పిల్లల వయసు పెరిగిన తర్వాత వాటిని ఆధార్‌లో అప్‌డేట్ చేయడం ద్వారా వివరాలు తాజాగానే ఉంటాయని యూఐడీఏఐ తెలిపింది.

### ప్రభుత్వ పథకాలు, ప్రవేశ పరీక్షలకు కీలకం

తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయకపోతే ఆధార్ ఆధారిత ధ్రువీకరణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని యూఐడీఏఐ పేర్కొంది. ముఖ్యంగా వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంతోపాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి పోటీ, విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలకు నమోదు సమయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. పిల్లల కోసం ఈ ప్రత్యేక డ్రైవ్‌ను 2025 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. 5–17 ఏళ్ల మధ్య పిల్లలకు 2026 సెప్టెంబర్ 30 వరకు ఎంబీయూ ఉచితంగా అందుబాటులో ఉంటుందని యూఐడీఏఐ తెలిపింది. 7–15 ఏళ్ల పిల్లలకు 2025 అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు ఎంబీయూ చార్జీలను రద్దు చేసింది. 5–7 ఏళ్లు, 15–17 ఏళ్ల వారికి ఇప్పటికే ఉచితంగానే ఎంబీయూ కొనసాగుతోంది.

# దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో కొత్త పార్టీ ఖాతాలు

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చేసిన 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యల నేపథ్యంలో సోషల్ మీడియాలో 'దిమాగీ నక్సల్ జనతా పార్టీ' పేరుతో ఖాతాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాని వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికలపై ప్రారంభమైన ఈ ఖాతాలకు అనూహ్య స్పందన లభించినట్లు కథనం పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 1.81 లక్షల మంది, ఎక్స్‌లో 7 వేల మందికి పైగా అనుసరిస్తున్నట్లు తెలిపింది. ప్రధాని వ్యాఖ్యల నేపథ్యంలో యువత, ప్రభుత్వం, పాలనా బాధ్యతలపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం, పెట్టుబడులు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ తదితర అంశాలపై యువత ప్రశ్నలు సంధిస్తున్న నేపథ్యంలో వాటికి ప్రభుత్వం సమాధానాలు, పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల సమస్యలు, పరీక్షల నిర్వహణ, ఉద్యోగ అవకాశాలపై నిరసనలు కొనసాగుతున్న సందర్భంలో పాలకులు యువత అభ్యర్థనలు, ప్రశ్నలను పరిగణనలోకి తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, పాలనను జవాబుదారీగా నిలదీయడం సహజ ప్రక్రియ అని, యువతను దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# పేటీఎంలో రూ.2,949 కోట్ల బ్లాక్ డీల్

- 3శాతం వాటా చేతులు మారిన వన్97 కమ్యూనికేషన్స్ షేర్లు
- గోల్డ్‌మన్ సాక్స్, బీఎన్‌పీ పారిబాస్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సహా దిగ్గజ సంస్థల కొనుగోళ్లు




**న్యూఢిల్లీ:** పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో 3 శాతం వాటా మంగళవారం బ్లాక్ డీల్ ద్వారా చేతులు మారింది. మొత్తం రూ.2,948.94 కోట్ల విలువైన ఈ లావాదేవీలో గోల్డ్‌మన్ సాక్స్, బీఎన్‌పీ పారిబాస్, సొసైటీ జనరల్ సహా పలు విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు షేర్లను కొనుగోలు చేశారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వివరాల ప్రకారం 1,92,10,110 షేర్లు, అంటే కంపెనీలో 3 శాతం వాటా లావాదేవీ జరిగింది. గోల్డ్‌మన్ సాక్స్, బీఎన్‌పీ పారిబాస్, సొసైటీ జనరల్‌తోపాటు ఘిసాలో క్యాపిటల్ మేనేజ్‌మెంట్, ఆక్స్‌బో క్యాపిటల్ మేనేజ్‌మెంట్, నార్త్ రాక్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, విరిడియన్ అసెట్ మేనేజ్‌మెంట్, విట్టోరియా ఫండ్–ఓసీ, ఇంటిగ్రేటెడ్ కోర్ స్ట్రాటజీస్ (ఏషియా) వంటి విదేశీ సంస్థలు షేర్లు కొనుగోలు చేశాయి. దేశీయంగా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్, హెచ్ఎస్‌బీసీ మ్యూచువల్ ఫండ్, సుందరం మ్యూచువల్ ఫండ్, టాటా మ్యూచువల్ ఫండ్ ఈ డీల్‌లో పాల్గొన్నాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా షేర్లు కొనుగోలు చేశాయి. బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరును సగటున రూ.1,535.10 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో మొత్తం లావాదేవీ విలువ రూ.2,948.94 కోట్లుగా నమోదైంది. ఇదే సంఖ్యలో షేర్లను రెసిలియెంట్ అసెట్ మేనేజ్‌మెంట్ బీవీ విక్రయించింది. కాగా మంగళవారం ఎన్ఎస్ఈలో వన్97 కమ్యూనికేషన్స్ షేరు 2.15 శాతం నష్టపోయి రూ.1,546.30 వద్ద ముగిసింది.

### 4.98 శాతం వాటా విక్రయానికి ప్రకటన

వన్97 కమ్యూనికేషన్స్ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మకు చెందిన రెసిలియెంట్ అసెట్ మేనేజ్‌మెంట్ బ్లాక్ డీల్ ద్వారా కంపెనీలో 4.98 శాతం వాటాను విక్రయించనున్నట్లు పేటీఎం సోమవారం ప్రకటించింది. అయితే ఈ విక్రయం ద్వారా వచ్చే మొత్తాన్ని చైనాకు చెందిన యాంట్‌ఫిన్ సంస్థ వద్దే ఉంచనున్నట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. రెసిలియెంట్ అసెట్ మేనేజ్‌మెంట్‌తో కుదుర్చుకున్న ఆప్షనల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్ ఒప్పందంలో భాగంగా ఈ నిధులు యాంట్‌ఫిన్‌కు చెందుతాయని తెలిపింది. గతంలో వన్97 కమ్యూనికేషన్స్‌లో యాంట్‌ఫిన్‌కు ఉన్న 10.3 శాతం ప్రత్యక్ష వాటాను 628 మిలియన్ డాలర్ల విలువకు రెసిలియెంట్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు బదిలీ చేసింది. అయితే ఆ వాటాపై ఆర్థిక హక్కులను మాత్రం యాంట్‌ఫిన్ తన వద్దే ఉంచుకుంది.

# 29న 'రైతు పంచాయతీ'కి పంజాబ్ రైతుల సన్నద్ధం

**న్యూఢిల్లీ:** ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నేతృత్వంలో దేశ రాజధానిలో 29న 'రైతు పంచాయతీ' నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఢిల్లీకి పాదయాత్రగా బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్–హర్యానా సరిహద్దులోని ఖనౌరీ వద్ద జింద్ పోలీసులు అడ్డుకుని, బారికేడ్లు ఏర్పాటు చేసి మార్గాన్ని మూసివేశారు. హర్యానా–పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర' నిర్వహించాలని దల్లేవాల్ పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర 29న ఢిల్లీలో జరిగే రైతు పంచాయతీతో ముగియనుందని తెలిపారు. రైతు సంఘాల ప్రతినిధులు, హర్యానా అధికారుల మధ్య ఇప్పటికే మూడు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ అవి అసంపూర్తిగా ముగిశాయని రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు.

# ఐదేళ్ల తర్వాత స్కోడా డీజిల్ సెగ్మెంట్‌లోకి

- కొత్త 'సూపర్బ్'తో భారత్‌లోకి పునరాగమనం
- కొత్త స్లావియా ఆవిష్కరణ.. ఆక్టావియా ఆర్ఎస్ కూడా రీఎంట్రీ

**ముంబై:** చెక్ రిపబ్లిక్‌కు చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా ఆటో భారత్‌లో డీజిల్ కార్ల విభాగంలోకి ఐదేళ్ల విరామం తర్వాత తిరిగి అడుగుపెట్టింది. ప్రీమియం ఎగ్జిక్యూటివ్ సెడాన్ 'ఆల్–న్యూ సూపర్బ్'ను మంగళవారం ఆవిష్కరించింది. దీంతోపాటు కొత్త స్లావియాను పరిచయం చేయడంతోపాటు స్పోర్టియర్ వెర్షన్ ఆక్టావియా ఆర్ఎస్ తిరిగి భారత మార్కెట్‌లోకి రానున్నట్లు ప్రకటించింది. భారత్‌లో బీఎస్–6 ఉద్గార ప్రమాణాలు అమల్లోకి రాకముందు స్కోడా ఆటో ఇండియా తన డీజిల్ కార్ల విక్రయాలను నిలిపివేసింది. తాజాగా సూపర్బ్ డీజిల్ వేరియంట్‌తో ఈ విభాగంలోకి మళ్లీ ప్రవేశిస్తోంది. డీజిల్ పవర్‌ట్రెయిన్ అందుబాటులోకి రావడం ద్వారా సూపర్బ్ ఆకర్షణ మరింత పెరుగుతుందని కంపెనీ పేర్కొంది. స్కోడా ఫ్లాగ్‌షిప్ లగ్జరీ సెడాన్‌గా సూపర్బ్ టీడీఐ.. భారత వినియోగదారులకు ప్రపంచస్థాయి ఉత్పత్తులను అందించాలన్న తమ నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపింది. ఎంక్యూబీ–ఏ0–ఇన్ ప్లాట్‌ఫామ్‌పై కొత్త స్లావియాను భారత పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసినట్లు స్కోడా తెలిపింది. కొత్త మోడల్‌లో మెరుగైన డిజైన్, అధునాతన సాంకేతికత, విభాగంలో తొలిసారిగా అందిస్తున్న ఫీచర్లు, మరింత సౌకర్యం కల్పించినట్లు పేర్కొంది. డ్రైవింగ్ అనుభూతి, ప్రాక్టికాలిటీ, భద్రత వంటి అంశాలను కొనసాగించినట్లు వెల్లడించింది.

### భారత్ కీలక మార్కెట్

భారత్ తమకు అత్యంత కీలకమైన ప్రపంచ వృద్ధి మార్కెట్లలో ఒకటని స్కోడా ఆటో సీఈఓ క్లాస్ జెల్మర్ అన్నారు. కొత్త స్లావియా సంస్థ విజయవంతమైన మోడళ్లలో ఒకటిగా మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. భారత వినియోగదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రపంచ ప్రమాణాలతో కూడిన వాహనాలను అందించడమే తమ లక్ష్యమని స్కోడా ఆటో వోక్స్‌వ్యాగన్ ఇండియా ఎండీ, సీఈఓ పీయూష్ అరోరా తెలిపారు.

# 'నేను కూడా దిమాగీ నక్సల్‌నే'

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 'దిమాగీ నక్సల్స్'పై చేసిన వ్యాఖ్యలను ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నించే వారిని దిమాగీ నక్సల్స్‌గా పరిగణిస్తే తాను కూడా దిమాగీ నక్సల్‌నేనని వ్యాఖ్యానించారు. తాను నిజమైన దేశభక్తుడినని, బీజేపీకి భయపడే వ్యక్తిని కాదని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ దేశంలో సాయుధ నక్సలిజాన్ని నిర్మూలించామని, అయితే 'దిమాగీ నక్సల్స్' సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేజ్రీవాల్.. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి రహిత సమాజం, మెరుగైన ఆస్పత్రులు, పాఠశాలలు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిని కూడా దిమాగీ నక్సల్స్‌గా పరిగణిస్తారా అని ప్రశ్నించారు. భగత్‌సింగ్, అంబేద్కర్ వంటి నాయకులు నేడు జీవించి ఉంటే వారిని కూడా అదే విధంగా పిలిచేవారేమోనని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల హక్కు అని, ప్రజా సమస్యలకు సమాధానాలు, పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

# ఉగ్రవాదంపై పోరులో వెనక్కి తగ్గేది లేదు

## సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై కఠినచర్యలు

న్యూఢిల్లీ: సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదంతో సహా అన్ని రకాల ఉగ్ర కార్యకలాపాలను అడ్డుకునే విషయంలో భారత్ వెనక్కి తగ్గబోదని స్పష్టం చేసింది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర నెట్‌వర్క్‌ను భగ్నం చేసిన ఘటనను అంతర్గత భద్రతా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే భారత్ ఉపయోగించుకుంటోందన్న పాక్ ఆరోపణలను విదేశాంగ శాఖ తోసిపుచ్చింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా ఉగ్రవాదంపై, ముఖ్యంగా సరిహద్దు ఉగ్రవాదంపై అంతర్జాతీయ చర్యలను బలోపేతం చేసేందుకు భారత్ కృషి చేస్తోందని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఓడించేందుకు అవసరమైన ప్రతి చర్యనూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### ఆరోపణలు నిరాధారం: పాక్

అమిత్ షా ఆరోపణలను పాకిస్థాన్ విదేశాంగ శాఖ తిరస్కరించింది. భారత్ చేసిన ఆరోపణలు నిరాధారమని పాక్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ ఆంద్రాబీ పేర్కొన్నారు. తమ దేశానికి సంబంధించిన ఆరోపణలతో భారత్ అంతర్గత భద్రతా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదిలాఉంటే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో పరిస్థితి తీవ్రంగా ఉందని జైస్వాల్ తెలిపారు. పాక్ భద్రతా బలగాల అణచివేత చర్యల్లో పలువురు మరణించారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల సరఫరాపైనా ఆంక్షలు విధించారని తెలిపారు. పీవోకే ప్రజలకు అంతర్జాతీయ సమాజం సానుభూతి, సంఘీభావం అందించాలని భారత్ కోరింది.

### 14 రాష్ట్రాల్లో ఆపరేషన్లు

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు 14 రాష్ట్రాల్లో సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్లలో ఐఎస్ఐ మద్దతున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్'కు చెందిన 200 మందికిపైగా కార్యకర్తలను అరెస్టు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశంలో విధ్వంసకర దాడులకు ఆ సంస్థ పన్నిన కుట్రలను భద్రతా బలగాలు భగ్నం చేశాయని తెలిపారు. ఆపరేషన్లలో ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామగ్రి, గూఢచర్యానికి ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు షా వెల్లడించారు.

# సోనియా జీవిత గాథ

- నవంబర్‌లో 'బెలాంగింగ్'
- రాజీవ్‌తో ప్రేమ నుంచి రాజకీయ ప్రస్థానం వరకు
- హత్య.. 2004లో ప్రధాని పదవిని తిరస్కరించిన ఘటనల ప్రస్తావన
- ఆరు దశాబ్దాల భారత సామాజిక, రాజకీయ మార్పులకు ప్రత్యక్ష సాక్షిగా సోనియా



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన వ్యక్తిగత, రాజకీయ జీవితాన్ని ఆవిష్కరించే జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకురానున్నారు. 'బెలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో వెలువడనున్న ఈ పుస్తకం నవంబర్ 10న అంతర్జాతీయంగా విడుదల కానుంది. అమెరికన్ ప్రచురణ సంస్థ ఆల్ఫ్రెడ్ ఏ. నాఫ్ ఈ విషయాన్ని ప్రకటించింది. భారత్‌లో పుస్తకం విడుదల తేదీని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ఇంకా వెల్లడించలేదు. 1965లో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో 19 ఏళ్ల విద్యార్థినిగా ఉన్న సోనియా మైనో.. రాజీవ్ గాంధీని తొలిచూపులోనే ప్రేమించిన సందర్భంతో పుస్తకం ప్రారంభమవుతుంది. యుద్ధానంతర ఇటలీలో బాల్యం నుంచి భారత్‌కు రావడం, రాజీవ్‌తో వివాహం, గాంధీ కుటుంబంలోకి అడుగుపెట్టడం తదితర వ్యక్తిగత విషయాలను ఆమె ఇందులో వివరించారు.

### ఇందిరతో అనుబంధం.. విషాదాలు

భారత తొలి మహిళా ప్రధాని, తన అత్త ఇందిరా గాంధీతో పరిచయం, భారతీయ సంస్కృతికి అలవాటు పడిన తీరు, హిందీ నేర్చుకోవడం, చీరలు ధరించడం, భారతీయ వంటకాలను ఆస్వాదించడం వంటి అనుభవాలను సోనియా పంచుకున్నారు. రాజీవ్ గాంధీ కమర్షియల్ పైలట్‌గా ఉన్న రోజుల్లోనే ఆమె మరిది సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించడం, ఆ తర్వాత ఇందిరా గాంధీ హత్యను ప్రత్యక్షంగా చూశారు. ఇందిర హత్య అనంతరం రాజీవ్ ప్రధాని బాధ్యతలు చేపట్టడం, ఏడేళ్లకే ఎన్నికల ప్రచారంలో ఆత్మాహుతి దాడిలో రాజీవ్ హత్యకు గురికావడం తన జీవితాన్ని తీవ్రంగా మార్చిన విషాదాలుగా సోనియా పేర్కొన్నారు.

### 2004లో ప్రధాని పదవికి నో

రాజీవ్ హత్య అనంతరం ఎన్నో ఏళ్ల పాటు రాజకీయాల్లోకి రావాలన్న ఒత్తిడిని సోనియా గాంధీ తిరస్కరించారు. చివరకు 1998లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి 2022 వరకు ఆ పదవిలో కొనసాగారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి విజయం సాధించిన తర్వాత ప్రధాని పదవిని స్వయంగా తిరస్కరించి, మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేసిన విషయాన్నీ పుస్తకంలో ప్రస్తావించారు. తన వ్యక్తిగత జీవితాన్ని చాలా అరుదుగా బహిరంగంగా పంచుకున్న సోనియా.. రాజీవ్ మరణం, వ్యక్తిగత విషాదాలే తనను రాజకీయాల బహిరంగ ప్రపంచంలోకి తీసుకొచ్చాయని పేర్కొన్నారు. తన జీవితాన్ని రాయడం సులభంగా అనిపించలేదని, తనలోనే దాచుకున్న అనుభవాలను బయటపెట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఆరు దశాబ్దాలుగా భారత్‌లో తాను చూసిన సామాజిక, రాజకీయ మార్పులకు ఈ పుస్తకం ఒక ప్రత్యేక దృక్కోణాన్ని అందిస్తుందని ప్రచురణకర్తలు తెలిపారు.

# పాముకాటు ఇక నోటిఫయబుల్ వ్యాధి

- ప్రతి పాము కాటు కేసు, మరణాన్ని తప్పనిసరిగా నివేదించాల్సిందే
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు.. వైద్య కళాశాలలకు ఆదేశాలు
- యాంటీ స్నేక్ వెనం నిల్వలపై మహా ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ




**ముంబై:** పాముకాటును మహారాష్ట్ర ప్రభుత్వం 'నోటిఫయబుల్ డిసీజ్'గా ప్రకటించింది. ఇకపై అనుమానిత, నిర్ధారిత పాము కాటు కేసులతోపాటు వాటి వల్ల సంభవించే మరణాలను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, వైద్య నిపుణులు తప్పనిసరిగా అధికారులకు నివేదించాల్సి ఉంటుంది. పాముకాటు ఘటనలను సమర్థంగా పర్యవేక్షించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం, యాంటీ స్నేక్ వెనం (ఏఎస్‌వీ) లభ్యతను మెరుగ్గా ప్రణాళిక చేయడం ఈ నిర్ణయం ఉద్దేశమని ఆరోగ్య మంత్రి ప్రకాశ్ అబిట్కర్ తెలిపారు. ప్రతి ఆరోగ్య సంస్థ, వైద్యుడు పాముకాటు కేసులను సంబంధిత జిల్లా ఆరోగ్య అధికారి లేదా జిల్లా సివిల్ సర్జన్‌కు తెలియజేయాలి. తీవ్ర, ప్రాణాంతక కేసులు, పాము కాటు మరణాలను అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థల ద్వారా వెంటనే నివేదించాల్సి ఉంటుంది. కేసుల వివరాలను హెచ్ఎంఐఎస్/డీహెచ్ఐఎస్–2, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) తదితర వ్యవస్థల్లో నమోదు చేయనున్నారు.

### ఏఎస్‌వీ నిల్వలపైనా నిఘా

పాముకాటు బాధితులకు చికిత్స అందించే ఆసుపత్రులు తమ వద్ద ఉన్న ఏఎస్‌వీ నిల్వలు, అందిన పరిమాణం, వినియోగం, మిగిలిన స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పాముకాటు కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లో యాంటీవెనమ్ కొరత లేకుండా ఈ చర్యలు చేపడుతున్నారు. గడ్చిరోలి జిల్లా జప్తలై గ్రామంలోని ప్రభుత్వ సహాయంతో నడిచే గిరిజన వసతి పాఠశాలలో ఆగస్టు 9న విషపాము కాటుకు గురై ముగ్గురు విద్యార్థినులు మృతి చెందగా.. మరో ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు. అనంతరం ప్రభుత్వం ఆ పాఠశాల లైసెన్స్‌ను రద్దు చేసింది. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే ప్రభుత్వం పాముకాటును నోటిఫయబుల్ వ్యాధిగా ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### 'గోల్డెన్ అవర్‌లో చికిత్స కీలకం'

పాముకాటు ఘటన జరిగిన తొలి 60 నిమిషాల్లోనే వైద్యం అందించడం అత్యంత కీలకమని మంత్రి అబిట్కర్ గతంలో అసెంబ్లీలో పేర్కొన్నారు. భయాందోళనలు, చికిత్సలో జాప్యం కారణంగానే అనేక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. పాముకాటు నివారణ, ప్రథమ చికిత్స, సత్వర సమాచారం, బాధితులను సరైన ఆసుపత్రికి తరలించడంపై జిల్లా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. పాముకాటు జరిగిన ప్రాంతం, సమయం, కాలం, ఘటనకు దారితీసిన పరిస్థితులు, లక్షణాలు, అందించిన చికిత్స, ఏఎస్‌వీ మోతాదు, చికిత్స ఫలితం తదితర వివరాలను ప్రభుత్వం సేకరించనుంది. వీటి ఆధారంగా స్థానికంగా పాముకాటు నివారణ చర్యలను రూపొందించనున్నారు. రాష్ట్రం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేసి పాముకాటు నివారణ, నియంత్రణను పర్యవేక్షించనున్నారు.

# ఓటర్ ఐడీ తప్పనిసరి చేయండి



**వాషింగ్టన్:** అమెరికాలో ఎన్నికల చట్టాలను కఠినతరం చేయాలన్న తన వాదనకు భారత ఎన్నికల విధానాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉదాహరణగా చూపారు. భారత్‌లో ఓటర్లు చెల్లుబాటయ్యే ఫొటో గుర్తింపు కార్డుతోనే ఓటు వేస్తారని, అమెరికాలో మాత్రం చెల్లుబాటయ్యే ఫొటో ఐడీ లేకుండానే ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారంటూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తమ అధికారులను ప్రశ్నించారని ట్రంప్ తెలిపారు. ట్రూత్ సోషల్‌లో సోమవారం చేసిన పోస్టులో ట్రంప్.. ఇటీవల భారత్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారని పేర్కొన్నారు. వారిలో ఒక శాతం కంటే తక్కువ మంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని తెలిపారు. ప్రతి ఓటరూ చెల్లుబాటయ్యే ఫొటో గుర్తింపు పత్రాన్ని కలిగి ఉన్నారని చెప్పారు.

### పార్టీల్లో ఏకాభిప్రాయం కరవు

సేవ్ అమెరికా యాక్ట్‌పై డెమోక్రాట్లు, రిపబ్లికన్లలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ నెల ప్రారంభంలో అమెరికా సెనేట్ ఐదు వారాల విరామానికి వెళ్లినా.. బిల్లు ఆమోదంపై స్పష్టమైన పురోగతి కనిపించలేదు. భారత్, బ్రెజిల్ ఇప్పటికే ఓటర్ గుర్తింపు కార్డులను బయోమెట్రిక్ డేటాబేస్‌తో అనుసంధానించాయని వైట్‌హౌస్ ఫ్యాక్ట్‌షీట్ పేర్కొంది.

# ఇమ్రాన్‌ను ఆసుపత్రిలో చేర్పించండి

ఇస్లామాబాద్: జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్‌ను రెండు రోజుల్లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని పాక్ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ జరిగే సెప్టెంబర్ 16 వరకు ఆయన అక్కడే ఉండాలని ఆదేశించింది. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. వైద్య పరీక్షలు, చికిత్స సమయంలో సీనియర్ వైద్యుడితో పాటు ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యుడు కూడా అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. ఆసుపత్రి ఖర్చులను ఇమ్రాన్ కుటుంబమే భరించనుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఇమ్రాన్ ఖాన్‌కు వారానికి ఒకసారి కుటుంబ సభ్యులను కలిసేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఆసుపత్రి పరిసరాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని, వైద్య నివేదికలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించవద్దని ఆయన పార్టీ, మద్దతుదారులను హెచ్చరించింది.

### కంటి సమస్యతో ఆందోళనలు

73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో ఆయన కుడి కంటిలో సెంట్రల్ రెటినల్ వీన్ ఆక్లూజన్ (సీఆర్‌వీవో) సమస్య బయటపడింది. సరైన వైద్యం అందడం లేదంటూ ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు పలుమార్లు ఆరోపించారు. అయితే జైలు అధికారులు సమర్పించిన నివేదికలో.. ఇప్పటివరకు వివిధ వైద్య నిపుణులు 39 సార్లు పరీక్షించారని, కంటి చూపు దాదాపు సాధారణ స్థితికి చేరుకుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తారిఖ్ ఫజల్ చౌధరీ తెలిపారు. అయితే న్యాయశాఖ మంత్రి ఆజం నజీర్ తరార్ మాత్రం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించే అంశంపై ప్రభుత్వానికి అభ్యంతరాలున్నాయని చెప్పారు. జైలు చట్టాల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలను సవరించాలని కోర్టును కోరనున్నట్లు తెలిపారు.

### సెప్టెంబర్ 16న మళ్లీ విచారణ

ఇమ్రాన్ ఖాన్ పూర్తి వైద్య రికార్డులను తదుపరి విచారణకు సమర్పించాలని అడియాలా జైలు అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా, ఇమ్రాన్ పార్టీ సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతించింది. ఆసుపత్రి వద్ద పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు గుమిగూడవద్దని సీనియర్ నేత సల్మాన్ అక్రమ్ రాజా విజ్ఞప్తి చేశారు.

# నేడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ

**న్యూఢిల్లీ:** దేశ రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) బుధవారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే భేటీకి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించనున్నారు. విద్యార్థుల సమస్యలు, రామమందిరం విరాళాలపై ఆరోపణలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే వ్యూహంపై చర్చించనున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపైనా సమీక్షించనున్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కాంగ్రెస్ వైఖరిని కూడా ఖరారు చేసే అవకాశం ఉంది. సమావేశానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితర అగ్రనేతలు హాజరుకానున్నారు.

# అమ్మాయిలు అదుర్స్

- మహిళల హాకీ ప్రపంచకప్‌లో రికార్డు విజయం
- దక్షిణాఫ్రికాపై 6–1తో గెలుపు
- పూల్ 'డీ'లో అగ్రస్థానం
- రేపు ఇంగ్లండ్‌తో కీలక పోరు



**అమ్‌స్టెల్వీన్:** మహిళల హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు దూకుడు కొనసాగించింది. పూల్ 'డీ'లో మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 6–1తో ఘన విజయం సాధించింది. భారత జట్టు సాధించిన ఆరు గోల్స్‌ను ఆరుగురు వేర్వేరు ఆటగాళ్లు నమోదు చేయడం విశేషం. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లు సాధించిన భారత్.. మెరుగైన గోల్ తేడాతో పూల్ 'డీ'లో అగ్రస్థానానికి చేరింది. తొలి క్వార్టర్‌లోనే భారత్ ఖాతా తెరిచింది. 11వ నిమిషంలో సునెలిత టోప్పో గోల్ చేయడంతో భారత్ 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్ 17వ నిమిషంలో నవ్‌నీత్ కౌర్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని 2–0కు పెంచింది. 25వ నిమిషంలో సుశీలా చాను రీబౌండ్‌ను గోల్‌గా మలచడంతో భారత్ 3–0తో తొలి అర్ధభాగాన్ని ముగించింది. విరామం తర్వాత భారత దాడులు మరింత పదునెక్కాయి. 38వ నిమిషంలో దీపిక, 44వ నిమిషంలో లాల్‌రెమ్‌సియామి, 45వ నిమిషంలో సాక్షి రాణా వరుసగా గోల్స్ చేయడంతో భారత్ 6–0తో తిరుగులేని ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ ముగిసే సమయంలో దక్షిణాఫ్రికా తరపున డి వాల్ కైలా పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచినా.. అప్పటికే భారత్ విజయం ఖాయమైంది.

### చైనాతో సమాన పాయింట్లు

పూల్ 'డీ'లో భారత్, చైనా రెండేసి మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో కొనసాగుతున్నాయి. అయితే మెరుగైన గోల్ తేడా భారత్‌కు కలిసొచ్చి అగ్రస్థానంలో నిలిచింది. ఇంగ్లండ్ మూడు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన దక్షిణాఫ్రికా తదుపరి దశకు చేరే అవకాశాన్ని కోల్పోయింది. భారీ తేడాతో సాధించిన ఈ విజయం భారత్‌కు తదుపరి దశలో కీలకంగా మారనుంది. తన చివరి పూల్ మ్యాచ్‌లో గురువారం ఇంగ్లండ్‌తో తలపడనుంది. తదుపరి రౌండ్‌కు చేరడంలో ఈ మ్యాచ్ ఫలితం కీలకం కానుంది. ప్రపంచకప్‌లో 11 మంది అరంగేట్ర ఆటగాళ్లతో బరిలోకి దిగిన కోచ్ స్జోర్డ్ మారిజ్నేకు దక్షిణాఫ్రికాపై విజయం ఉత్సాహాన్నిచ్చింది.

## బాబర్‌కు గాయం.. తొలి టెస్టుకు దూరం

- ఇంగ్లండ్‌తో టెస్టుకు పాక్ కెప్టెన్ ఔట్
- సల్మాన్ ఆఘా సారథ్యంలో బరిలోకి దిగనున్న పాక్

**లీడ్స్:** ఇంగ్లండ్‌తో బుధవారం ప్రారంభమయ్యే తొలి టెస్టుకు పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్ దూరమయ్యాడు. కుడి చేతి మధ్య వేలికి గాయం కావడంతో అతడిని తొలి టెస్టుకు ఎంపిక చేయలేదు. టీ20 జట్టు కెప్టెన్ సల్మాన్ ఆఘా తొలిసారి టెస్టు జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ఈ నెలలో వెస్టిండీస్‌తో ఆడినప్పుడు బాబర్ వేలికి గాయమైంది. గత వారం బెక్హామ్‌లో జరిగిన సన్నాహక మ్యాచ్‌లో అదే వేలికి మరోసారి దెబ్బ తగిలింది. వేలు విరగలేదని పాక్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. నొప్పి తగ్గితే ఆగస్టు 27 నుంచి లార్డ్స్‌లో జరిగే రెండో టెస్టుకు బాబర్ అందుబాటులోకి వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవలే తిరిగి కెప్టెన్‌గా నియమితుడైన బాబర్.. వెస్టిండీస్ సిరీస్‌లో పాక్ తరపున అత్యధిక పరుగులు సాధించాడు. అతడి గైర్హాజరు జట్టుకు గట్టి దెబ్బగా మారింది. మరోవైపు గాయం నుంచి కోలుకున్న షాన్ మసూద్ తిరిగి టాప్ ఆర్డర్‌లో ఆడనున్నాడు. 2020 తర్వాత తొలిసారి పాకిస్థాన్ ఇంగ్లండ్‌లో పర్యటిస్తోంది. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ కూడా ఒత్తిడిలో ఉంది. బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత జో రూట్ మరోసారి టెస్టు జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. హ్యారీ బ్రూక్ వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు.

# లక్ష్యసేన్ శుభారంభం!

- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ తొలి రౌండ్‌లో విజయం
- ఆస్ట్రియా షట్లర్‌పై 16–21, 21–8, 21–4 తేడాతో గెలుపు




**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆస్ట్రియాకు చెందిన కాలిన్స్ వాలెంటైన్ ఫిలిమోన్‌పై 16–21, 21–8, 21–4తో విజయం సాధించాడు. 45 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్ కోల్పోయినప్పటికీ.. వ్యూహాన్ని మార్చుకుని వరుసగా రెండు గేమ్‌లను సొంతం చేసుకుని తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లాడు. తొలి గేమ్‌లో తన షాట్లు చిన్నగా పడటంతో ప్రత్యర్థి సులభంగా ఆధిపత్యం చెలాయించాడని మ్యాచ్ అనంతరం లక్ష్యసేన్ తెలిపాడు. ఫిలిమోన్ ఎత్తుగా ఉండటంతో డ్రైవ్ షాట్లను సమర్థంగా ఎదుర్కొన్నాడని చెప్పాడు. దీంతో రెండో గేమ్‌లో ఆటను విస్తరించి, ర్యాలీలను పొడిగిస్తూ ఆడటంపై దృష్టి పెట్టినట్లు వివరించాడు. ఈ వ్యూహం ఫలించడంతో రెండో గేమ్‌ను 21–8తో, నిర్ణాయక మూడో గేమ్‌ను 21–4తో గెలుచుకున్నాడు. కోర్టులో గాలి పరిస్థితులు కూడా తొలి గేమ్‌లో తన ఆటపై ప్రభావం చూపాయని లక్ష్య పేర్కొన్నాడు. గాలి ఉన్న వైపు ఆడటంతో షటిల్‌ను లిఫ్ట్ చేయడం కష్టమైందని, తన లిఫ్ట్‌లు చిన్నగా పడటంతో ప్రత్యర్థికి అవకాశాలు లభించాయని చెప్పాడు. కోర్టు మారిన తర్వాత మెరుగైన పరిస్థితులు లభించడంతో స్వేచ్ఛగా ఆడగలిగానని వివరించాడు. తదుపరి రౌండ్‌లో లక్ష్యసేన్ అమెరికాకు చెందిన గారెట్ టాన్‌తో తలపడనున్నాడు. తొలి రౌండ్‌లో టాన్ స్విట్జర్లాండ్‌కు చెందిన టోబియాస్ క్యూన్జీని 21–4, 21–15తో ఓడించాడు.

### ఆయుష్ విజయంపై ప్రశంసలు

ప్రపంచ నంబర్ వన్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ షి యూకీని తొలి రౌండ్‌లోనే ఓడించిన యువ భారత షట్లర్ ఆయుష్ శెట్టి విజయంపైనా లక్ష్యసేన్ స్పందించాడు. ఆయుష్ అద్భుత విజయం సాధించాడని ప్రశంసించాడు. అతడికి అందరూ మద్దతుగా నిలిచామని, రాబోయే మ్యాచ్‌ల్లోనూ ఆయుష్ ఇదే జోరు కొనసాగించాలని ఆకాంక్షించాడు.

# విజయానికి చేరువగా భారత్

- రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా ఆల్‌రౌండ్ షో
- అర్ధ సెంచరీతో రాణించిన పంత్
- టెస్టుల్లో 100 సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు



**గాలె:** రిషభ్ పంత్ దూకుడైన అర్ధశతకానికి తోడు భారత బౌలర్లు చెలరేగడంతో శ్రీలంకతో తొలి టెస్టులో టీమిండియా భారీ విజయానికి చేరువైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 372 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక 84 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. విజయానికి ఇంకా 288 పరుగులు అవసరం కాగా.. భారత్ మరో ఆరు వికెట్లు పడగొడితే మ్యాచ్‌ను సొంతం చేసుకోనుంది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్ కేవలం 53 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి 66 పరుగులతో రాణించాడు. లహిరు కుమార బౌలింగ్‌లో సిక్సర్ బాది ఫిఫ్టీ పూర్తి చేసిన పంత్.. టెస్టుల్లో 100 సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత వేగంగా ఈ మైలురాయిని చేరిన ఆటగాడిగానూ నిలిచాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దేవదత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) విలువైన పరుగులు జోడించారు. చివర్లో భారత బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఇన్నింగ్స్ త్వరగా ముగిసినా.. శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచడంలో భారత్ విజయవంతమైంది.

### బౌలర్ల విజృంభణ

భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంకను భారత బౌలర్లు తొలి నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. మహ్మద్ సిరాజ్ నిశాన్ ఫెర్నాండోను ఔట్ చేయగా.. ప్రసిద్ధ్ కృష్ణ కమిందు మెండిస్‌ను పెవిలియన్‌కు పంపాడు. అనంతరం ఎడమచేతి స్పిన్నర్ మానవ్ సుతార్ చెలరేగాడు. ఫీల్డింగ్‌లో గాయపడిన దినేశ్ చండీమల్ స్థానంలో కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన పసిందు సూరియబండారాను సుతార్ తొలి బంతికే ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేశాడు. ఆ తర్వాత లహిరు ఉదారాను కూడా అతడే పెవిలియన్‌కు పంపాడు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా (31), తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన సోనాల్ దినూష (25) క్రీజులో ఉన్నారు.



### లంక ముందు పెను సవాల్

గాలె మైదానంలో ఇప్పటివరకు విజయవంతంగా ఛేదించిన అత్యధిక లక్ష్యం 344 పరుగులే. 2022లో పాకిస్థాన్ ఈ ఘనత సాధించింది. 1998 తర్వాత ఈ వేదికపై 200కుపైగా లక్ష్యాన్ని ఛేదించింది కేవలం రెండుసార్లే. దీంతో 372 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడం శ్రీలంకకు పెను సవాల్‌గా మారింది. మరోవైపు నాలుగో రోజు నాలుగు వికెట్లు పడగొట్టిన భారత్.. చివరి రోజు మ్యాచ్‌ను ముగించి విజయాన్ని అందుకోవాలని చూస్తోంది.




# స్టాక్ మార్కెట్లకు ఆరో రోజూ నష్టాలే

- సెన్సెక్స్ 493 పాయింట్లు పతనం.. నిఫ్టీ 132 పాయింట్లు డౌన్
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు, అమెరికా బాండ్ ఈల్డ్స్ ప్రభావం

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. పశ్చిమాసియాలో దౌత్యపరమైన పరిష్కారంపై ఆశలు సన్నగిల్లడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం, అమెరికా బాండ్లపై రాబడులు అధికం కావడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 492.70 పాయింట్లు (0.63 శాతం) నష్టపోయి 77,235.46 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 132.75 పాయింట్లు (0.55 శాతం) కోల్పోయి 24,154.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ వరుసగా ఆరో సెషన్‌లోనూ నష్టాలను నమోదు చేసింది. సెన్సెక్స్ ప్యాక్‌లో ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ లాభాల్లో నిలిచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.46 శాతం పడిపోగా, స్మాల్‌క్యాప్ సెలెక్ట్ 0.24 శాతం పెరిగింది. ఫోకస్డ్ ఐటీ సూచీ అత్యధికంగా 1.84 శాతం క్షీణించింది. ఐటీ–రియల్టీ 1.28 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ 1.04 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.81 శాతం, ఎఫ్ఎంసీజీ 0.67 శాతం, మెటల్, క్యాపిటల్ గూడ్స్ సూచీలు చెరో 0.47 శాతం చొప్పున నష్టపోయాయి. మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్, హాస్పిటల్స్, హెల్త్‌కేర్ సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి.

### 91 డాలర్లకు ముడిచమురు

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 0.17 శాతం పెరిగి బ్యారెల్‌కు 91.02 డాలర్లకు చేరింది. ముడిచమురు ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ ఆఫ్ రీసెర్చ్ వినోద్ నాయర్ తెలిపారు. అమెరికా బాండ్లపై పెరిగిన రాబడులు, బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు కూడా దేశీయ ఈక్విటీల్లో అమ్మకాలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. అమెరికా–ఇరాన్ తాత్కాలిక కాల్పుల విరమణ గడువు ముగియడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశాలపై ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు.




### టాటా షేర్లలోనూ అమ్మకాలు

టాటా గ్రూప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 2.28 శాతం, టాటా కెమికల్స్ 1.63 శాతం, టీసీఎస్ 1.47 శాతం, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ 1.25 శాతం, వోల్టాస్ 1.10 శాతం, టాటా కమ్యూనికేషన్స్ 1 శాతం, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 0.94 శాతం నష్టపోయాయి. ఇదిలా ఉండగా, టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) మంగళవారం కోరమ్ లేకపోవడంతో వాయిదా పడింది. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌ల ప్రతినిధులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పదవీకాలం ముగిసిన తర్వాత టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పునర్నియామకానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో ఈ ఏజీఎంకు ప్రాధాన్యం ఏర్పడింది.

### ఎఫ్ఐఐల అమ్మకాలు

అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ పరిస్థితులు నెలకొన్నాయి. దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ–225 నష్టాల్లో ముగియగా, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్, హాంకాంగ్ హ్యాంగ్‌సెంగ్ స్వల్ప లాభాలతో ముగిశాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా కదిలాయి. సోమవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా ఆరో సెషన్‌లో నష్టపోవడానికి అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనత, ముడిచమురు ధరల పెరుగుదల, అమెరికా ట్రెజరీ బాండ్లలో భారీ అమ్మకాలు కారణమని ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ తెలిపారు. కాగా సోమవారం విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) రూ.2,535.10 కోట్ల విలువైన భారతీయ ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడించాయి.

## ఆర్థిక పనితీరులో మెరుగుదల

- అమెజాన్ సెల్లర్ సర్వీసెస్‌కు తగ్గిన నష్టం

**న్యూఢిల్లీ:** అమెజాన్ ఈ–కామర్స్ విభాగం అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ ఆర్థిక పనితీరులో మెరుగుదల నమోదైంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర నష్టం రూ.389.9 కోట్లకు తగ్గింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం 2024–25లో నికర నష్టం రూ.408.2 కోట్లుగా నమోదైంది. అంటే ఏడాది వ్యవధిలో నష్టాన్ని సుమారు రూ.18.3 కోట్ల మేర తగ్గించుకుంది. కంపెనీ కార్యకలాపాల్లో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. పన్ను, వడ్డీ వ్యయాలకు ముందు తొలిసారిగా సుమారు రూ.172 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ కార్యకలాపాల స్థాయిలో లాభదాయకతను సాధించినట్లు తెలుస్తోంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. 2024–25లో రూ.3,036.83 కోట్లుగా ఉన్న కార్యకలాపాల ఆదాయం.. 2025–26లో 15 శాతం వృద్ధితో రూ.3,496.68 కోట్లకు చేరింది. ఆదాయం పెరగడంతోపాటు నష్టాలు తగ్గడం, పన్ను–వడ్డీకి ముందే లాభం నమోదు కావడం సంస్థ ఆర్థిక పనితీరు మెరుగుపడుతున్న సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

# టీనేజర్ల కోసం 'చాట్‌జీపీటీ' ప్రత్యేక వెర్షన్

- చదువు, విమర్శనాత్మక ఆలోచనకు తోడ్పాటు
- బలమైన భద్రతా ఫీచర్లు




**ముంబై:** ప్రముఖ కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ ఓపెన్ ఏఐ టీనేజర్ల కోసం ప్రత్యేకంగా 'చాట్‌జీపీటీ ఫర్ టీన్స్' వెర్షన్‌ను మంగళవారం విడుదల చేసింది. యువ వినియోగదారులు నేర్చుకోవడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, అంశాలను లోతుగా అర్థం చేసుకోవడం, ఏఐని విశ్వాసంతో వినియోగించుకోవడంలో ఇది సహాయపడుతుందని సంస్థ తెలిపింది. టీనేజర్ల కోసం ఇందులో మరింత పటిష్ఠమైన అంతర్గత భద్రతా రక్షణలను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

డీఎస్‌పీ గ్రూప్‌నకు చెందిన నాన్–బ్యాంకింగ్ రుణ విభాగం డీఎస్‌పీ ఫైనాన్స్.. వోల్ట్ మనీ ప్రమోటర్ సాల్టర్ టెక్నాలజీస్‌ను వెల్లడించని మొత్తానికి కొనుగోలు చేసింది. రెండేళ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ రుణ పుస్తకం రూ. 4,000 కోట్లుగా ఉంది. మ్యూచువల్ ఫండ్లపై రుణాలు అందించే డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని డీఎస్‌పీ ఫైనాన్స్ తెలిపింది.

### సీఐఐ వెల్‌బీయింగ్‌కు నీర్జా బిర్లా

ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నీర్జా బిర్లాను 'సీఐఐ ఇండియా వెల్–బీయింగ్ ఇనిషియేటివ్ 2026' విజన్ చైర్‌గా మంగళవారం నియమించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని స్థిరమైన వృద్ధికి కీలక సాధనంగా గుర్తిస్తూ.. ఆరోగ్యకరమైన, ఒత్తిడిని తట్టుకునే, భవిష్యత్తుకు సిద్ధమైన కార్యాలయాలను రూపొందించేందుకు, అలాగే సంస్థలకు క్రమబద్ధమైన మార్గదర్శకాన్ని అందించడమే ఈ కార్యక్రమమని సీఐఐ తెలిపింది.

# 2కోట్ల మంది విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్

- 1.6 లక్షల పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్
- 5–17 ఏళ్ల వారికి సెప్టెంబర్ 30 వరకు ఉచితం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల ఆధార్ తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ)లో భాగంగా 2 కోట్లకు పైగా పిల్లల వివరాలను అప్‌డేట్ చేసినట్లు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) మంగళవారం వెల్లడించింది. ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు 1.6 లక్షల పాఠశాలలను కవర్ చేసినట్లు తెలిపింది. పిల్లలకు 5 ఏళ్లు నిండినప్పుడు, ఆ తర్వాత 15 ఏళ్ల వయసులో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయడం తప్పనిసరి. ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదు సమయంలో పేరు, ఇతర జనాభా వివరాలు, ఫొటో మాత్రమే తీసుకుంటారు. ఆ వయసులో వేలిముద్రలు, కనుపాపల వివరాలు అభివృద్ధి చెందుతున్నందున బయోమెట్రిక్ వివరాలను నమోదు చేయరు. పిల్లల వయసు పెరిగిన తర్వాత వాటిని ఆధార్‌లో అప్‌డేట్ చేయడం ద్వారా వివరాలు తాజాగానే ఉంటాయని యూఐడీఏఐ తెలిపింది. తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయకపోతే ఆధార్ ఆధారిత ధ్రువీకరణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని యూఐడీఏఐ పేర్కొంది. ముఖ్యంగా వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంతోపాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి పోటీ, విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలకు నమోదు సమయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. పిల్లల కోసం ఈ ప్రత్యేక డ్రైవ్‌ను 2025 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. 5–17 ఏళ్ల మధ్య పిల్లలకు 2026 సెప్టెంబర్ 30వరకు ఎంబీయూ ఉచితంగా అందుబాటులో ఉంటుందని యూఐడీఏఐ తెలిపింది. 7–15 ఏళ్ల పిల్లలకు 2025 అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు ఎంబీయూ చార్జీలను రద్దు చేసింది. 5–7 ఏళ్లు, 15–17ఏళ్ల వారికి ఇప్పటికే ఉచితంగానే ఎంబీయూ కొనసాగుతోంది. తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌ను పూర్తి చేయాలని యూఐడీఏఐ సూచించింది. యూడైస్ ప్లస్‌తో యూఐడీఏఐ సాంకేతిక అను సంధానంచేయడం ద్వారా అమలు చేస్తోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ స్థితిని తెలుసుకునే అవకాశం కలిగింది.



# 'గన్‌మాస్టర్ జీ9'పై జెనీలియా ఆశలు

వైవిధ్యమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ భాషలతో సంబంధం లేకుండా సినీప్రియులను ఆకట్టుకుంటున్న కథానాయిక జెనీలియా మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవల 'రాజా శివాజీ' చిత్రంతో అలరించిన ఆమె, బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీతో కలిసి నటిస్తున్న 'గన్‌మాస్టర్ జీ9'పై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది. ఆదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అపర్శక్తి ఖురానా కీలక పాత్రలో కనిపించనున్నారు. దీపక్ ముకుత్, హునార్ ముకుత్, సంగీత అహిర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్, రొమాన్స్, సంగీతం మేళవింపుతో తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదల తేదీని జెనీలియా తాజాగా సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియో ద్వారా ప్రకటించింది. ''ఈసారి బుల్లెట్ల మోత మాత్రమే కాదు.. మీ హృదయాలను గెలుచుకునేందుకు యాక్షన్, రొమాన్స్, సంగీతంతో రాబోతున్నాం'' అంటూ ఆసక్తికరమైన వ్యాఖ్యలను జోడించింది. దీంతో ఈ సినిమా నవంబరు 27న థియేటర్లలోకి రానున్నట్లు అధికారికంగా వెల్లడైంది. ప్రేమకథకు యాక్షన్ అంశాలను జోడిస్తూ దర్శకుడు ఆదిత్య దత్ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. ముఖ్యంగా కథకు అనుగుణంగా ఉండే బలమైన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొంది. ఇమ్రాన్ హష్మీ, జెనీలియా జోడీ తొలిసారి తెరపై ఎలా కనిపించనుందనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో నెలకొంది. మరోవైపు అపర్శక్తి ఖురానా పాత్ర కథలో కీలక మలుపులకు కారణమవుతుందని తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు రొమాంటిక్ ఎమోషన్స్, ఆకట్టుకునే సంగీతంతో సినిమాను రూపొందిస్తున్న నేపథ్యంలో 'గన్‌మాస్టర్ జీ9'పై అంచనాలు పెరుగుతున్నాయి. విడుదల తేదీని ప్రకటించడంతో ప్రమోషన్ కార్యక్రమాలను కూడా చిత్రబృందం వేగవంతం చేయనున్నట్లు తెలుస్తోంది.

### గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో..
# వారణాసి మేకింగ్ వీడియో

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు డా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీవ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన



తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ–ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ ప్రక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ–ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్ఆర్ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు డా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది.

### పాజిటివ్ టాక్‌తో
# దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్

సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది.



మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷–గ్గం÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజు థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

### రాముడి సుగుణాలు కనిపించాలంటే
# రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే

కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓ చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీవ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు



రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

### 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్'
# ఆరో భాగంపై ఆసక్తికర అప్‌డేట్!



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులను విశేషంగా అలరించిన 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్' ఫ్రాంచైజ్ నుంచి ఆరో చిత్రం తెరకెక్కేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నిధి అన్వేషణలు, సముద్ర సాహసాలు, మత్స్యకన్యలు, అద్భుతమైన ద్వీపాలు, మరణాన్ని సైతం తప్పించే పవిత్ర జలాల కోసం సాగే వేట వంటి ఆసక్తికరమైన అంశాలతో ఈ సిరీస్ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఇప్పటివరకు ఈ ఫ్రాంచైజ్‌లో ఐదు సినిమాలు విడుదల కాగా.. ప్రతి చిత్రం ప్రత్యేకమైన కథ, సాహస సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాలు ఇంతగా ఆదరణ పొందడానికి ప్రధాన కారణాల్లో జాక్ స్పారో పాత్ర ఒకటి. జాక్ స్పారోగా జానీ డెప్ తనదైన శైలి, హావభావాలు, కామెడీ టైమింగ్, విభిన్నమైన ఆహార్యంతో ప్రపంచవ్యాప్తంగా భారీ అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆరో భాగం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. జానీ డెప్ మరోసారి జాక్ స్పారోగా కనిపించే అవకాశం ఉందనే వార్తలు ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ఈ విషయంపై చిత్ర నిర్మాత జెర్రీ బ్రూక్‌హైమర్ తాజాగా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించినట్లు సమాచారం. ప్రస్తుతం జానీ డెప్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, ఆరో భాగానికి సంబంధించిన స్క్రీన్‌ప్లే పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే జాక్ స్పారోగా జానీ డెప్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే ఈసారి ఆయన పూర్తి స్థాయి కథానాయకుడిగా కనిపిస్తారా లేదా అన్నదానిపై మాత్రం స్పష్టత లేదు. ఆరో భాగంలో మార్గట్ రాబీ ప్రధాన పాత్రలో నటించే అవకాశముందని గతంలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జానీ డెప్ కీలకమైన సహాయ పాత్రలో జాక్ స్పారోగా కనిపించే అవకాశం ఉందని చిత్ర వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జానీ డెప్ తొలిసారిగా 2003లో విడుదలైన 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్: ది కర్స్ ఆఫ్ ది బ్లాక్ పెరల్' చిత్రంలో జాక్ స్పారో పాత్రలో కనిపించారు. ఆ సినిమా ఘన విజయం సాధించడంతో జాక్ స్పారో పాత్ర ప్రపంచవ్యాప్తంగా ఎంతో పాపులర్ అయింది. అనంతరం వచ్చిన 'డెడ్ మ్యాన్స్ చెస్ట్', 'అట్ వరల్డ్స్ ఎండ్', 'ఆన్ స్ట్రేంజర్ టైడ్స్', 'డెడ్ మెన్ టెల్ నో టేల్స్' చిత్రాల్లోనూ జానీ డెప్ అదే పాత్రలో మెప్పించారు. ముఖ్యంగా ఆయన చెప్పే డైలాగులు, విచిత్రమైన నడక, హావభావాలు, ప్రమాదాలను సైతం తనదైన తెలివితో ఎదుర్కొనే తీరు జాక్ స్పారో పాత్రకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. 2017లో విడుదలైన ఐదో భాగం గత చిత్రాల స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయినా.. ఈ ఫ్రాంచైజ్‌పై అభిమానుల్లో మాత్రం క్రేజ్ కొనసాగుతూనే ఉంది. 2018 నుంచే ఆరో భాగానికి సంబంధించిన వార్తలు వినిపిస్తున్నప్పటికీ వివిధ కారణాలతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. ఇప్పుడు స్క్రీన్‌ప్లే పనులు కొనసాగుతున్నాయని నిర్మాత స్వయంగా వెల్లడించడంతో ఆరో భాగంపై మళ్లీ ఆసక్తి నెలకొంది. ఒకవైపు కొత్త కథానాయికతో ఫ్రాంచైజ్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుండగా.. మరోవైపు జానీ డెప్‌ను జాక్ స్పారోగా తిరిగి తీసుకురావాలనే ఆలోచన ఉండటం అభిమానుల్లో అంచనాలను మరింత పెంచుతోంది. అయితే జానీ డెప్ పాత్ర ఎంతసేపు ఉంటుంది? కథలో ఆయనకు ఎలాంటి ప్రాధాన్యం ఉంటుంది? మార్గట్ రాబీతో ఆయన పాత్రకు ఎలాంటి సంబంధం ఉంటుంది? అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం జానీ డెప్‌తో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో అవి సఫలమై ఆయన మరోసారి జాక్ స్పారోగా కనిపిస్తే.. ఈ సిరీస్ అభిమానులకు అది పెద్ద ట్రీట్‌గా మారనుంది. మరి 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్' ఆరో భాగం ఎప్పుడు పట్టాలెక్కుతుంది? జానీ డెప్ నిజంగానే జాక్ స్పారోగా తిరిగి వస్తారా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.



### 'కెప్టెన్ ఇండియా'లో
# పార్వతి తిరువోతు

బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక యాక్షన్ థ్రిల్లర్ 'కెప్టెన్ ఇండియా'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. 'అబ్ తక్ ఛప్పన్', 'చక్ దే! ఇండియా', 'రాకెట్ సింగ్' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రతిభావంతుడైన దర్శకుడు షిమిత్ అమిన్ దాదాపు 15 ఏళ్ల విరామం తర్వాత ఈ సినిమాతో మరోసారి మెగాఫోన్ పట్టనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. బవేజా స్టూడియోస్, టీ–సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఓ యుద్ధ ప్రాంతం నుంచి భారతదేశం చేపట్టిన అతిపెద్ద మానవీయ రెస్క్యూ ఆపరేషన్ నేపథ్యంలో కథ సాగనుంది. ఆ క్లిష్టమైన ఆపరేషన్‌కు నాయకత్వం వహించి, అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన పైలట్ పాత్రలో కార్తీక్ ఆర్యన్ కనిపించనున్నారు. ప్రస్తుతం కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా షూటింగ్‌లో పాల్గొంటున్న కార్తీక్ ఆర్యన్, ఆ చిత్రాన్ని పూర్తి చేసిన అనంతరం 'కెప్టెన్ ఇండియా' షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాలో ప్రముఖ నటి పార్వతి తిరువోతు కీలక పాత్రలో నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె పోషించబోయే పాత్రకు సంబంధించిన వివరాలను చిత్రబృందం ప్రస్తుతానికి గోప్యంగా ఉంచినప్పటికీ, కథలో ఆమె పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో పార్వతి భాగం కావడంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. కథకు బలమైన భావోద్వేగ కోణాన్ని జోడించే పాత్రలో ఆమె కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారీ స్థాయిలో తెరకెక్కించనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులు ఇప్పటికే కొనసా గుతున్నట్లు తెలుస్తోంది. 'కెప్టెన్ ఇండియా' షూటింగ్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.